# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 23-3-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:185 పేజీలు:6 వెల: రూ.1/-


**చురక**

అరెస్టులు దాడులు
అకౌంటుల సీజులు
విపక్షాల్ని ఎన్నికల్లో
విగత చేసే రోజులు.

సామ దాన భేద దండ
సకల కుటిల ఉపాయాలు
పవర్ పార్టీ అమలు చేసే
ప్రజాస్వామ్య అపాయాలు




-వేల్పుల నారాయణ

## పరీక్షా పత్రాలు లీక్ ప్రచారం అవాస్తవం

హైదరాబాద్, మార్చి 22 (ఎక్స్ ప్రెస్ న్యూ స్););::: టెన్త్ పేపర్ లీకెజ్ పై వివిధ సామాజిక మాధ్యమాల్లో జరిగిన ప్రచారం అవాస్తవమని పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న పదవ తరగతి పరీక్షలలో 19వ తేదీన నిర్వహించిన 2వ భాషా పరీక్షా పత్రాలు లీక్ అయ్యాయని జరిగిన ప్రచారంలో వాస్తవం లేదని, అదే విధంగా 20వ తేదీన పది ప్రశ్నా పత్రం బయటకు వచ్చింది అని జరిగిన ప్రచారం కూడా అవాస్తవమని కమిషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ ఈ సంఘటన పై చేసిన విచారణలో ఎలాంటి తప్పిదాలు జరగలేదని తేలింది. పదవ తరగతి పరీక్షలు రాష్ట్రంలో సజావుగా జరుగుతున్నాయని, తగు భద్రత ఏర్పాట్లు కూడా చేశామని కమిషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# నా జీవితం దేశానికి అంకితం.. అరెస్ట్ తర్వాత కేజ్రీవాల్ తొలి రియాక్షన్



న్యూఢిల్లీ, మార్చి 22: తన జీవితం దేశానికి అంకితం అని అన్నారు ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ ). మద్యం కుంభకోణం కేసులో ఈడీ అరెస్ట్ తర్వాత ఆయన తొలిసారి మాట్లాడారు. ఎక్కడ ఉన్నా దేశం కోసం పనిచేస్తుంటానని పేర్కొన్నారు.

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు కేజ్రీవాల్‌ను గురువారం రాత్రి అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం ఆయన్ని ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచారు. ఆ సమయంలో కేజ్రీవాల్ కోర్టు లోపలికి వెళ్తూ.. 'నా జీవితం దేశానికి అంకితం. లోపల ఉన్నా బయట ఉన్నా దేశం కోసం పనిచేస్తుంటా' అని పేర్కొన్నారు.

ఆయనే కింగ్‌పిన్.. కేజ్రీ పాత్రను కోర్టుకు వివరించిన ఈడీ

మరోవైపు కేజ్రీవాల్‌ను ఈడీ పది రోజుల కస్టడీకి కోరింది. ఈ మేరకు మద్యం కుంభకోణంలో కేజ్రీవాల్ పాత్రపై కోర్టుకు వివరించింది. 28 పేజీల రిమాండ్ రిపోర్ట్‌ను ఈడీ కోర్టు ముందు ఉంచింది. సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు ఈడీ తరపున వాదనలు వినిపిస్తున్నారు. ఈ కేసులో కేజ్రీవాల్ కింగ్‌పిన్ అని, మద్యం పాలసీ అమలులో ఆయన ప్రత్యక్షంగా పాల్గొన్నారని కోర్టుకు వివరించారు. 'మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్ కింగ్‌పిన్. పాలసీ అమలులో ఆయన ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఇందులో సౌత్ గ్రూప్‌నకు అనుకూలంగా వ్యవహరించారు. ఇది రూ.వంద కోట్ల స్కామ్ కాదు.. రూ.600 కోట్ల స్కామ్. ఇందులో కేజ్రీవాల్‌కు రూ.300 కోట్లు అందాయి. పంజాబ్, గోవా ఎన్నికల్లో ఖర్చుపెట్టింది ఈ డబ్బే. రూ.45 కోట్లు హవాలా ద్వారా గోవాకు పంపారు. ఆప్, సౌత్ గ్రూప్‌ల మధ్య విజయ్‌నాయర్ వారధిగా ఉన్నాడు. విజయ్ నాయర్ కంపెనీ నుంచి అన్ని ఆధారాలూ సేకరించాం. మా దగ్గర అన్ని ఆధారాలూ ఉన్నాయి' అని ఈడీ వివరించింది. ఈ కేసులో విచారణ నిమిత్తం కేజ్రీవాల్‌ను పది రోజులు కస్టడీకి కోరింది. ప్రస్తుతం వాదనలు కొనసాగుతున్నాయి. న్యాయమూర్తి తీర్పుపై ఉత్కంఠ కొనసాగుతోంది. విచారణ నేపథ్యంలో కోర్టు వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## హోలీ సందర్భంగా మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లను బంద్

హైదరాబాద్ మార్చ్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూ స్ );హోలీ సందర్భంగా మూడు పోలీస్ కమిషనరేట్ల పరిధిలోని మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లను బంద్ చేస్తూ హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు ఆదేశాలు జారీ చేశారు. హోలీ సందర్భంగా ఈ నెల 25వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 26వ తేదీ ఉదయం 6గంటల వరకు మద్యం షాపులు, కల్లుదుకాణాలు, రెస్టారెంట్లు బంద్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. బార్లు, స్టార్ హోటళ్లు, రిజిస్ట్రర్డ్ క్లబ్బులకు మినహాయింపు ఉన్నట్లు పేర్కొన్నారు. హోలీ సందర్భంగా ఎలాంటి న్యూసెన్స్ చేయవద్దని, బైక్‌లపై తిరుగుతూ అరుస్తూ, రంగులు పూయవద్దని, రోడ్లపై హోలీ వేడుకలు చేసుకోవద్దని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి హెచ్చరించారు.

# మానవతా దాతృత్వంతో సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి

### – రాష్ట్ర నూతన గవర్నర్ సి. పి రాధాకృష్ణన్ పిలుపు



హైదరాబాద్, మార్చి 22:(ఎక్స్ ప్రెస్ న్యూస్ ):మానవతా దాతృత్వంతో సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని తెలంగాణా రాష్ట్ర నూతన గవర్నర్ గా అదనపు బాధ్యతలు స్వీకరించిన సి. పి రాధాకృష్ణన్ పిలుపు నిచ్చారు.. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ చైర్మన్ మామిడి భీమ్ రెడ్డి ఆధ్వర్యంలో వావిళ్ళ నవీన్ యాదవ్ రాజ్ భవన్ లో గవర్నర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ జిల్లా, మాసబ్ ట్యాంక్ లో చేపడుతున్న బ్లడ్ సెంటర్ నిర్మాణం కొరకు నూతనంగా ప్యాట్రన్ మెంబర్షిప్ తీసుకున్న వావిళ్ళ నవీన్ యాదవ్ చురుకుగా బ్లడ్ సెంటర్ నిర్మాణం కొరకు 20 లక్షల రూపాయలు విలువైన బ్లడ్ సెంటర్ కు ఫ్లోరింగ్, టైల్స్ మరియు పార్టిషన్ పనులను తన సొంత ఖర్చులతో మానవత్వ దాతృత్వంతో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బ్లడ్ సెంటర్ నిర్మాణ పనులు చేపడుతున్నాడు. దీనికి నవీన్ యాదవ్ ను గవర్నర్ సిపి రాధాకృష్ణన్ అభినందిస్తూ తన చేతుల మీదుగా ప్యాట్రన్ మెంబర్షిప్ కార్డును అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ గారు మాట్లాడుతూ నవీన్ యాదవ్ లాగా ప్రతి ఒక్కరూ మానవతా దాతృత్వంతో ముందుకు వచ్చి హైదరాబాద్ జిల్లా శాఖ చేపడుతున్న బ్లడ్ సెంటర్ నిర్మాణ కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు. నవీన్ యాదవ్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ కార్యక్రమాలు భవిష్యత్తులో హైదరాబాద్ జిల్లా శాఖ నలుమూలల విస్తరించి మరింత మెరుగ్గా తన తోడ్పాటును అందిస్తానని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ స్టేట్ చైర్మన్ అజయ్ మిశ్రా, గవర్నర్ సెక్రెటరీ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ బుర్ర వెంకటేశం, గవర్నర్ సెక్రటరీలు రఘు ప్రసాద్, భవాని ప్రసాద్, రెడ్ క్రాస్ స్టేట్ శాఖ జనరల్ సెక్రటరీ మదన్ మోహన్ రావు, రెడ్ క్రాస్ హైదరాబాద్ జిల్లా శాఖ వైస్ చైర్మన్ విజయ కుమారి, హైదరాబాద్ జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు పి వీరమని, ఏవి రావు, పి జ్యోతి హైదరాబాద్ జిల్లా శాఖ హెల్త్ క్యాంప్ కో కన్వీనర్ కల్పనా దత్త, రెడ్ క్రాస్ వాలంటీర్లు సుజాత, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన మానాల..



హైదరాబాద్, మార్చి 22: రాష్ట్ర కోపరటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ గా నియమించినందుకు ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ రాష్ట్ర ఇంఛార్జి దీప్ దాస్ మున్షీని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మానాల మోహన్ రెడ్డి కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ లో రాష్ట్ర కోపర టివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పజెప్పినందుకు మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ మంత్రి బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు వేణు రాజ్, నిఖిల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ముంబై - గోరఖ్‌పూర్ గోదాన్ ఎక్స్‌ప్రెస్‌లో చెలరేగిన మంటలు..

ముంబై, మార్చి 22: ముంబై – గోరఖ్‌పూర్ గోదాన్ ఎక్స్‌ప్రెస్ రైల్లో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాద ఘటన నాసిక్ రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం సంభవించింది. సీటింగ్ కమ్ లగేజీ రేక్ కోచ్‌లో మంటలు చెలరేగినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ ప్రమాదంలో రెండు బోగీలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను ఆర్పేసింది. ప్రయాణికులను ఇతర రైళ్లల్లో తరలించారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.

అయితే నాసిక్ రోడ్డు స్టేషన్ నుంచి రైలు బయల్దేరిన కాసేపటికే కోచ్‌లో పొగలు ఏర్పడ్డాయి. ఆ తర్వాత క్షణాల్లోనే మంటలు చెలరేగాయని ప్రయాణికులు తెలిపారు. రైలును వెంటనే నిలిపివేశారు. తీవ్ర ఆందోళనకు గురైన ప్రయాణికులు క్షణాల్లోనే రైలును దిగేశారు. సమీపంలోనే హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఉండటంతో వాటికి మంటలు వ్యాపించకుండా అధికారులు, అగ్నిమాపక సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

## కేజ్రీవాల్ అరెస్ట్.. దేశ ప్రజాస్వామ్య చరిత్రలో మరో చీకటి రోజు : కేసీఆర్

హైదరాబాద్, మార్చి 22:ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు దేశ ప్రజాస్వామ్య చరిత్రలో మరో చీకటి రోజు అని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. ప్రతిపక్షాన్ని నామరూపాలు లేకుండా చేయాలనే ఏకైక సంకల్పంతో బీజేపీ వ్యవహరిస్తోంది. మొన్న హేమంత్ సోరెన్, నిన్న కవిత, నేడు కేజ్రీవాల్ ఘటనలే నిదర్శనం అని కేసీఆర్ పేర్కొన్నారు. ఈడీ, సీబీఐ, ఐటీ సహా దర్యాప్తు సంస్థలను కేంద్రం పావులుగా వాడుకుంటోందని కేసీఆర్ ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా పరిణమిస్తున్న కేంద్రం చర్యలను బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తోంది. కేజ్రీవాల్ అరెస్ట్ రాజకీయ ప్రేరేపితమైన అరెస్ట్. అక్రమ కేసులను వెంటనే వెనక్కి తీసుకొని, అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని కేసీఆర్ డిమాండ్ చేశారు.

# కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా బీజేపీ కార్యాలయ ముట్టడికి ఆప్ నేతల యత్నం




హైదరాబాద్, మార్చి 22: ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో ఏ పాత్ర లేని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ను ఈడీ అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ తెలంగాణ ఆప్ నేతలు శుకవారం నాంపల్లిలోని బీజేపీ కార్యాలయం ముట్టడికి యత్నించారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళనకారులను అరెస్టు చేశారు. మోదీ హఠావో..దేశ్‌కో బచావో అంటూ నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ ఉత్తర భారత దేశంలో ఆప్ బలాన్ని చూసి ఎక్కడ ఓడిపోతామనే భయంతోనే ప్రధాని మోదీ ప్రతిపక్ష పార్టీలపై ఈడీని ఉసుగొల్పుతున్నాడని ఆరోపించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను(ఇఈ) బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులను వేటాడేందుకు ఉపయోగించుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ప్రతి పక్షం, ప్రజాస్వామ్యం గొంతును అణిచివేసేందుకు కేంద్రం ఎమర్జెన్సీ పాలన కొనసాగిస్తుందని పేర్కొన్నారు.

తక్షణమే అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును ఈడీ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్ కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, డాక్టర్ అన్సారీ, ఎంఏ మజీద్, యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ మల్లంగి ,మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ మల్లోజు,అధికార ప్రతినిధులు జావీద్, అక్షయ్, మదన్ లాల్, హైదర్, టి రాకేష్‌సింగ్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# అర్వింద్ కేజ్రీవాల్ అరెస్ట్ అప్రజాస్వామికం : కర్ణాటక సీఎం సిద్ధరామయ్య




న్యూఢిల్లీ, మార్చి 22:ఢిల్లీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్ అరెస్ట్ అప్రజాస్వామికమని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య అన్నారు. కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణి అవలంభిస్తున్నదని ఆయన విమర్శించారు. కేవలం భయపెట్టి దారికి తెచ్చుకోవడం కోసమే కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశారని మండిపడ్డారు.

కేజ్రీవాల్ ఏం చేశాడని ఈడీ అరెస్ట్ చేసిందని సిద్ధరామయ్య ప్రశ్నించారు. కేజ్రీవాల్ అరెస్టుకు కావాల్సిన ఆధారాలే వాళ్ల దగ్గర లేవని, అయినా అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని అన్నారు. కేంద్ర సర్కారు నియంతృత్వ ధోరణి అవలంభిస్తున్నది అనడానికి ఇదే ఉదాహరణ అని వ్యాఖ్యానించారు.

## ప్రధాని మోడీకి భూటన్ అత్యున్నత పౌర పురస్కారం

న్యూ డిల్లీ మార్చ్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ప్రధాని నరేంద్ర మోడీకి భూటన్ అత్యున్నత పౌర పురస్కారం వరించింది.

భూటాన్ రాజు ప్రధాని మోడీకి ఆర్డర్ ఆఫ్ డ్రుక్ గ్యాల్పోను ప్రధానం చేశారు. భూటాన్ అత్యున్నత పౌర పురస్కారం అందుకున్న మొదటి విదేశీ నాయకుడిగా మోడీ రికార్డు నమోదుచేశారు. ఈ నేపథ్యంలో విదేశాంగ మంత్రి జయశంకర్ ప్రధానికి అభినందనలు తెలిపారు.

## సుప్రీంకోర్టులో కవితకు లభించని బెయిల్

న్యూ డిల్లీ మార్చ్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );లిక్కర్ కేసులో బెయిల్ కోసం సుప్రీంకోర్టుకు వెళ్లిన బిఆర్ఎస్ నాయకురాలు కవితకు సాంత్వన లభించలేదు. బెయిల్ కోసం కింది కోర్టుకు వెళ్లవలసిందిగా సర్వోన్నత న్యాయస్థానం సూచించింది. లిక్కర్ కుంభకోణం కేసులో తన అరెస్ట్ ను సవాల్ చేస్తూ కవిత సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ పై ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. తాము కేసు మెరిట్స్ లోకి వెళ్లదలచుకోలేదని, బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లాలని ధర్మాసనం సూచించింది. అంతకుముందు కవిత తరపున ప్రముఖ న్యాయవాది కపిల్ సిబ్బల్ వాదిస్తూ లిక్కర్ కేసులో తన క్లయింట్ ను ఒకసారి సాక్షిగా, మరొకసారి నిందితురాలిగా ఈడి పిలిచిందని, ఈ కేసులో చోటు చేసుకుంటున్న పరిణామాలు కలవరం కలిగిస్తున్నాయని అన్నారు. కవితకు వ్యతిరేకంగా ఒక్క బలమైన సాక్ష్యమూ లేదన్నారు.

# బొగ్గు దిగుమతుల వాటాలో క్షీణత

న్యూఢిల్లీ, మార్చి 22:దేశంలోని మొత్తం బొగ్గు వినియోగంలో బొగ్గు దిగుమతి వాటా తగ్గింది. ఏప్రిల్ 2023 నుండి జనవరి 2024 వరకు బొగ్గు దిగుమతుల వాటా 21%కి క్షీణించింది, ఇది మునుపటి సంవత్సరం ఇదే కాలంలో 22.48%.

థర్మల్ పవర్ ప్లాంట్లు కలపడం కోసం దిగుమతి చేసుకున్న బొగ్గు పరిమాణంలో 36.69% తగ్గుదల ఉంది, ఏప్రిల్ 2023 నుండి జనవరి 2024 వరకు 19.36 మిలియన్ టన్నులకు (ఓ) తగ్గింది, ఇది మునుపటి సంవత్సరం ఇదే కాలానికి భిన్నంగా ఉంది. కలపడం కోసం దిగుమతి చేసుకున్న బొగ్గు తగ్గింపు దేశీయ బొగ్గును ఉపయోగించుకునే దిశగా మారడాన్ని సూచిస్తుంది, తద్వారా దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుంది. దీనికి విరుద్ధంగా, ఏప్రిల్ 2023 నుండి జనవరి 2024 వరకు దిగుమతి చేసుకున్న బొగ్గు ఆధారిత పవర్ ప్లాంట్ల ద్వారా బొగ్గు దిగుమతులు గత సంవత్సరంతో పోల్చితే 94.21% గణనీయంగా పెరిగాయి.

ఈ పవర్ ప్లాంట్లు కేవలం దిగుమతి చేసుకున్న బొగ్గు ఆధారంగా రూపొందించబడినందున, పైన పేర్కొన్న కాలంలో బొగ్గు దిగుమతి ధరల్లో గణనీయమైన తగ్గుదల కారణంగా వృద్ధిని చెప్పవచ్చు. భారతదేశం ప్రధానంగా దక్షిణాఫ్రికా మరియు ఇండోనేషియా నుండి థర్మల్ బొగ్గును దిగుమతి చేసుకుంటుంది మరియు ఈ దేశాల నుండి సగటు ధరలు ఏప్రిల్ 2023 నుండి జనవరి 2024 వరకు వరుసగా 54% మరియు 38% తగ్గాయి, మునుపటి సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే.

ఇంకా, అఎఒ ద్వారా పొందబడిన వేలం ప్రీమియంలో బొగ్గు నోటిఫైడ్ ధర కంటే గణనీయమైన తగ్గింపు ఉంది. ఇది ఏప్రిల్ 2022 నుండి జనవరి 2023 మధ్య కాలంలో 278% నుండి 2023–24 ఆర్థిక సంవత్సరంలో అదే కాలంలో 82%కి తగ్గింది.

**నేటి కందం– నేటికీ అందం**

**సరియగు పథమున వాతా**
**వరణములో గలుగు మార్పు ప్రకటించుటకై**
**ధర యేర్పరచిన వాతావరణ దినోత్సవమును**
**జరు పగవలయుమొగిన్**



(మార్చి 23 ప్రపంచ వాతావరణ దినోత్సవం) **-రాధశ్రీ**
సెల్:9494481210

# పిఠాపురం నుంచే జనసేన ఎన్నికల ప్రచారం..

అమరావతి, మార్చి 22:దేశ వ్యాప్తంగా ఎన్నికల నోటిఫికేషన్ రిలీజ్ అయ్యింది. ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో.. ఆయా పార్టీలు ఇప్పటి నుంచే కసరత్తులు ప్రారంభించాయి. ఇందులో భాగంగానే పవన్ కళ్యాణ్ తన ఎన్నికల ప్రచారాన్ని పిఠాపురం నుంచి ప్రారంభిస్తారని జనసేన పార్టీ ప్రకటించింది.

వారాహి వాహనం నుంచి ప్రచారం ప్రారంభిస్తారని, 3 రోజుల పాటు ఆ నియోజకవర్గంలోనే బస చేస్తారని తెలిపింది. కాగా, జనసేన పోటీ చేసే సీటు కావడంతో వైసీపీ అనేక ప్లాన్స్ వేస్తోందని, అప్రమత్తంగా ఉండాలని శ్రేణులకు పవన్ దిశానిర్దేశం చేసినట్లు జనసేన వెల్లడించింది.

# భూటాన్ ప్రధాన మంత్రితో ప్రధానమంత్రి ద్వైపాక్షిక సమావేశం మరియు అవగాహన ఒప్పందాల మార్పిడి

న్యూఢిల్లీ, మార్చి 22:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీని హెచ్.ఇ. ఈరోజు థింపులో భూటాన్ ప్రధాన మంత్రి షెరింగ్ టోబ్గే గౌరవార్థం వర్కింగ్ లంచ్‌ను ఏర్పాటు చేశారు. పారో నుండి థింపూ వరకు ప్రయాణం అంతా ప్రజలు తనను అభినందించడంతో పాటు, తనకు లభించిన అసాధారణమైన ప్రజా స్వాగతానికి ప్రధాన మంత్రి టోబ్గేకి కృతజ్ఞతలు తెలిపారు. ఇరువురు నేతలు బహుముఖ ద్వైపాక్షిక సంబంధాలపై పలు అంశాలపై చర్చలు జరిపారు మరియు పునరుత్పాదక ఇంధనం, వ్యవసాయం, యువజన మార్పిడి, పర్యావరణం మరియు అటవీ రంగం మరియు పర్యాటకం వంటి రంగాలలో సహకారాన్ని మరింత పెంపొందించుకోవడానికి ఒక అవగాహన కుదుర్చుకున్నారు. భారతదేశం మరియు భూటాన్ అన్ని స్థాయిలలో అత్యంత విశ్వాసం, సద్భావన మరియు పరస్పర అవగాహనతో కూడిన దీర్ఘకాల మరియు అసాధారణమైన సంబంధాలను కలిగి ఉన్నాయి.

సమావేశానికి ముందు, ప్రధాని మోదీ మరియు భూటాన్ ప్రధానమంత్రి ఇంధనం, వాణిజ్యం, డిజిటల్ కనెక్టివిటీ, అంతరిక్షం, వ్యవసాయం, యువత అనుసంధానంపై అనేక అవగాహన ఒప్పందాలు/ఒప్పందాలను పరస్పరం మార్చుకున్నారు.

# ముందస్తు వాతావరణ హెచ్చరికలతో అపార నష్ట నివారణ..!

**(23 మార్చి 'ప్రపంచ వాతావరణ దినం' సందర్భంగా)**

నిత్యం వాతావరణంలో జరిగే మార్పులు, రాబోయే వారం–నెల–ఏడాదిలో జరుగబోయే వాతావరణ మార్పుల సూచనలను ప్రజలకు ముందస్తు హెచ్చరికలుగా తెలిపే విధులను 'ప్రభుత్వ వాతావరణ శాఖ' నిర్వహిస్తుంది. "ప్రపంచ వాతావరణ దినం(వరల్డ్ మెటీరోలాజికల్ డే)" వేదికగా మానవాళి శ్రేయస్సు కోసం 'వెదర్', 'క్లైమేట్', 'నీటి'కి సంబంధించిన అంశాలను మానవాళి సుఖ జీవనం, మానవ జాతి భద్రత కోసం వాతావరణ శాస్త్ర నిపుణులు అనునిత్యం సేవలను అందిస్తున్నారు.

క్లైమేట్, వెదర్‌ల మధ్య వ్యత్యాసం:

23 మార్చి 1950న 193 దేశాలతో కూడిన 'ప్రపంచ వాతావరణ సంస్థ' అంతర్జాతీయ సమావేశానికి నిర్వహించడం జరిగింది. ఈ చారిత్రక సమావేశానికి గుర్తుగా 1961 నుంచి ప్రతి ఏటా 23 మార్చిన 'ప్రపంచ వాతావరణ దినం' జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. స్వల్పకాలిక వాతావరణ పరిస్థితులను 'వెదర్' వివరిస్తుంది. ఒక ప్రత్యేక ప్రాంతపు దీర్ఘకాలపు సగటు 'వెదర్' సమాచారాన్ని 'క్లైమేట్'గా అభివర్ణిస్తారు. ఉష్ణోగ్రత, పీడనం, నీటి తేమ, మబ్బులు, గాలి, దూళి, వర్షం, వరదలు, మంచు తుఫానుల లాంటి అంశాల మీద 'వెదర్' ఆధారపడి ఉంటుంది. ఒక ప్రత్యేక ప్రాంతపు దీర్ఘకాలపు వాతావరణ పరిస్థితులైన నీటి తేమ, ఉష్ణోగ్రత, సూర్యకాంతి, గాలి లాంటి అంశాల మీద 'క్లైమేట్' ఆధారపడి ఉంటుంది. నేటి డిజిటల్‌యుగంలో కూడా ప్రపంచ మానవాళిలో 33 శాతానికి వాతావరణ హెచ్చరికలు సకాలంలో అందకపోవడంతో అపార నష్టాలను భరించాల్సి వస్తున్నది.

విపత్తుల్లో నష్ట నివారణకు వాతావరణ హెచ్చరికలు:

ఐరాస తీర్మానం ప్రకారం 2021–30 కాలాన్ని 'ఐరాస – సముద్ర వైజ్ఞానికశాస్త్రంతో సుస్థిరాభివృద్ధి దశాబ్దం'గా నిర్ణయించిన నేపథ్యంలో ప్రపంచ వాతావరణ దినం–2024 నినాదాన్ని 'ముందస్తు వాతావరణ చర్యలు (ఎట్ ది ఫ్రంట్‌లైన్ ఆఫ్ క్లైమెట్ ఆక్షన్)'గా తీసుకొని చర్చించడం జరుగుతోంది. దేశ ప్రజల శ్రేయస్సు, భద్రత కోసం వాతావరణశాస్త్రం, ఆపరేషనల్ హైడ్రోలజీ, ఎర్థ్ సైన్సెస్‌ల మధ్య సమన్వయం అత్యంత అవసరం అని మరువరాదు. 2030 వరకు ప్రపంచ దేశాలు తీవ్రమైన వెదర్, క్లైమేట్, నీరు, ఇతర పర్యావరణ ప్రతికూలతలను ఎదుర్కొంటూ, సామాజిక ఆర్థిక దుష్పరిణామాలను అనుభవించనుందని ఐరాస అంచనా వేస్తున్నది. మానవాళి సుస్థిరాభివృద్ధి సఫలం కావడానికి శిలావరణం (నేల), జలావరణం (నీరు), వాతావరణం (గాలి), జీవావరణం (ప్రాణులు) సానుకూలంగా సహకరించాలి. సకాలంలో వాతావరణ హెచ్చరికల విడుదలతో అపార ఆస్తి ప్రాణ నష్టాలను నివారంచడం తేలికవుతుంది.

మానవాళి మనుగడకు కావలసిన వాతావరణ మార్పులు చర్చించడానికి సభలు, సమావేశాలు, విద్యాలయాల్లో పోటీలు, ప్రదర్శనలు, కార్యశాలలు నిర్వహించుటకు ప్రపంచ వాతావరణ దినం వేదిక దోహదపడుతుంది. వాతావరణ ప్రతికూలతలు నేటి మానవ తప్పిదాలని, మానవ ప్రమేయమే వాటికి కారణమని గుర్తిద్దాం. ప్రకృతి ప్రళయాలకు, అసాధారణ మార్పులకు అడ్డుకట్ట వేద్దాం. భూమాతను నివాసయోగ్య గ్రహంగా, గృహంగా పునర్‌ప్రతిష్టిద్దాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# స్టార్టప్ ల మధ్య ఆవిష్కరణకు, సహకారానికి ఉత్ప్రేరకంగా ఎస్సిఓ స్టార్టప్ ఫోరమ్

న్యూఢిల్లీ, మార్చి 22:షాంఘై సహకార సంస్థ (ఎస్సిఓ) స్టార్టప్ ఫోరమ్ నాల్గవ ఎడిషన్ 19 మార్చి 2024న న్యూఢిల్లీలో నిర్వహించారు. ఈ చొరవ ఎస్సిఓ సభ్య దేశాల మధ్య ప్రారంభ పరస్పర చర్యలను విస్తృతం చేయడం, ఆవిష్కరణలకు అనుకూలమైన వాతావరణాన్ని పెంపొందించడం, ఉద్యోగ కల్పనను ప్రోత్సహించడం, వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి యువ ప్రతిభావంతులను ప్రేరేపించడం లక్ష్యం.

ఫోరమ్ ప్లీనరీ సెషన్‌లో ఎస్సిఓ స్టార్టప్‌ల ప్రతినిధి బృందం, సభ్య దేశాలలో స్టార్టప్‌ల కోసం నోడల్ ఏజెన్సీలు, సీనియర్ ప్రభుత్వ అధికారులు, దౌత్యవేత్తలతో సహా ఎస్సిఓ సభ్య దేశాల నుండి ఈ సదస్సులో పాల్గొన్నారు. పరిశ్రమల ప్రోత్సాహక విభాగం (డిపిఐఐటి), వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ రాజేష్ కుమార్ సింగ్ దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టం కావాలంటే స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ పాత్ర ఎంత ముఖ్యమో వివరిస్తూ కీలకోపన్యాసం చేశారు. డిపిఐఐటి జాయింట్ సెక్రటరీ శ్రీ సంజీవ్ భారతదేశ స్టార్టప్ ప్రస్థానం, భారత ప్రభుత్వం స్టార్టప్‌లను ప్రోత్సహించే కార్యక్రమాల గురించి ప్రతినిధి బృందాన్ని ఉద్దేశించి ప్రసంగించారు.

ఎస్సిఓ పెవిలియన్‌లో జరిగిన ప్రదర్శనలో 15 ఎస్సిఓ స్టార్టప్‌లు తమ ఉత్పత్తులు, సేవలను ప్రదర్శించాయి. ఈ ప్రదర్శన ద్వారా వ్యవస్థాపకులను ప్రేరేపించడానికి, విద్యావంతులను చేయడానికి, సాధికారత కోసం రూపొందించిన నెట్‌వర్కింగ్ అవకాశాలను అందించింది. అంతేకాకుండా, 'పెట్టుబడి నిధిని ఏర్పాటు చేయడం: ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించడానికి వ్యూహాత్మక విధానం' అనే అంశంపై స్టార్టప్ ఇండియా నిర్వహించిన వర్క్‌షాప్‌కు కూడా ప్రతినిధులు హాజరయ్యారు. వర్క్‌షాప్‌లో ప్రారంభ దశ స్టార్టప్‌లకు మద్దతుగా సీడ్ ఫండ్‌ల ఏర్పాటుకు సంబంధించిన వివిధ నమూనాలను అర్థం చేసుకోవడానికి ఒక ఇంటరాక్టివ్ సెషన్‌ను చేర్చారు. వర్క్‌షాప్ పాల్గొనేవారికి సీడ్ ఫండ్ ని ఏర్పాటు చేయడంలో వ్యూహాత్మక ప్రణాళిక, అమలుపై సమగ్ర అవగాహన కల్పించారు.

16 సెప్టెంబర్ 2022న ఉజ్బెకిస్తాన్‌లోని సమర్‌కండ్‌లో జరిగిన ఎస్సిఓ దేశాధినేతల శిఖరాగ్ర సమావేశంలో స్టార్టప్‌లు, ఇన్నోవేషన్ ప్రత్యేక వర్కింగ్ గ్రూప్ (ఎస్డబ్ల్యూజి)ని రూపొందించడానికి అన్ని సభ్య దేశాలు అంగీకరించాయి. ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లడం, వైవిధ్యపరచడంలో ఆవిష్కరణ, వ్యవస్థాపకత ప్రాముఖ్యతను పరిగణనలోకి తీసుకుని, భారతదేశం అంగీకరించింది. ఎస్సిఓ సభ్య దేశాల మధ్య సహకారానికి కొత్త ఆధారాన్ని రూపొందించడానికి 2020లో ఈ చొరవను ప్రతిపాదించింది. ఎస్సిఓ సభ్య దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించే దృష్టితో ఎస్డబ్ల్యూజి రూపకల్పన జరిగింది. ఇది స్టార్టప్ పర్యావరణ వ్యవస్థకు ప్రయోజనం చేకూర్చడమే కాకుండా ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేస్తుంది. 2023లో, డిపిఐఐటి అధ్యక్షతన జరిగిన అనేక రౌండ్ల సమావేశాల తర్వాత, ఎస్సిఓ లో భారతదేశం శాశ్వతంగా అధ్యక్షత వహించడానికి ఎస్డబ్ల్యూజి నిబంధనలను ఆమోదించాలని సభ్య దేశాలు నిర్ణయించాయి.

డిపిఐఐటి స్టార్టప్ పర్యావరణ వ్యవస్థల కోసం వివిధ కార్యక్రమాలను నిర్వహించింది. అటువంటి చొరవకు నేతృత్వం వహించడం ద్వారా, భారతదేశం ఇన్నోవేషన్ పాదముద్రను విస్తరించడానికి, మొత్తం పర్యావరణ వ్యవస్థను ఒకదానితో ఒకటి కలపడానికి, ఇతర ఎస్సిఓ సభ్య దేశాలను ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడానికి ఇదొక అవకాశం. స్టార్టప్ ఎంగేజ్‌మెంట్‌లను ఎస్సిఓ సభ్య దేశాలలో స్థానిక స్టార్టప్ పర్యావరణ వ్యవస్థలను బలోపేతం చేయడం, పెట్టుబడిదారులు, కార్పొరేట్ ఎంగేజ్‌మెంట్ కార్యకలాపాలకు మార్గనిర్దేశం చేయడం, యాక్సెస్ చేయడం ద్వారా స్టార్టప్‌లకు విలువను అందించడం అనే లక్ష్యంతో భారతదేశం నిర్వహిస్తుంది.

భారతదేశం నవంబర్ 2024లో ఎస్డబ్ల్యూజి రెండవ సమావేశానికి, జనవరి 2025 లో ఎస్సిఓ స్టార్టప్ ఫోరమ్ 5.0కి ఆతిథ్యం ఇవ్వనుంది. అంతకు ముందు స్టార్టప్ ఇండియా ఎస్సిఓ సభ్య దేశాల కోసం వివిధ కార్యక్రమాలను నిర్వహించింది.

# భారతదేశంలో శాంతియుత ప్రయోజనాల కోసం అణుశక్తిని వినియోగిస్తుండడంపై అవగాహన పెంచేందుకు ఎన్‌సీసీ, ఎన్‌పీసీఐఎల్ ఒప్పందం

న్యూఢిల్లీ, మార్చి 22:భారతదేశంలో శాంతియుత ప్రయోజనాల కోసం అణుశక్తిని వినియోగిస్తుండడంపై ప్రజల్లో అవగాహన పెంచడానికి, శాస్త్రీయమైన ఒ ప్రామాణికమైన సమాచారాన్ని వ్యాప్తి చేయడానికి దేశవ్యాప్తంగా వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం కోసం 'నేషనల్ క్యాడెట్ కార్ప్స్' (ఎన్‌సీసీ), 'న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్' (ఎన్‌పీసీఐఎల్) ఈ రోజు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఎన్‌సీసీ డీజీ లెఫ్టినెంట్ జనరల్ గుర్బీర్‌పాల్ సింగ్, ఎన్‌పీసీఐఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ బీవీఎస్ శేఖర్ ఒప్పందంపై సంతకాలు చేశారు.

ఎన్‌సీసీ క్యాడెట్‌లకు అవగాహన కల్పించడం కోసం దేశవ్యాప్తంగా నిర్వహించే శిబిరాలు ఒ వివిధ కార్యకలాపాల సమయంలో ఎన్‌పీసీఐఎల్ రిసోర్స్ పర్సన్‌లను అందిస్తుంది. ఒప్పందంలో భాగంగా, దేశవ్యాప్తంగా ఉన్న ఎన్‌పీసీఐఎల్ కేంద్రాలను సందర్శించడానికి క్యాడెట్‌లకు ప్రత్యేక అవకాశం కల్పిస్తుంది. తద్వారా, అణుశక్తి శాంతియుత వినియోగం, దాని సాంకేతిక అంశాలపై క్యాడెటలకు ప్రత్యక్ష అనుభవం వస్తుంది.

క్యాడెట్‌ల అవగాహన పరిధిని విస్తృతం చేయడానికి చేపట్టిన చొరవల్లో ఈ కార్యక్రమం ఒకటిగా ఎన్‌సీసీ డీజీ ఎన్‌సీసీ అభివర్ణించారు. యువతలో మరింత అవగాహన కల్పించడానికి, వారిని బాధ్యతాయుతంగా తీర్చిదిద్దడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. 1.5 మిలియన్ల ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రపంచవ్యాప్తంగా యువత ఆలోచనలను ప్రభావితం చేయగలరని స్పష్టం చేశారు. అణుశక్తిని శాంతియుతంగా వినియోగించుకోవడంపై అవగాహన కల్పించే కార్యక్రమాలను విజయవంతం చేయడంలో క్యాడెట్లు కీలకపాత్ర పోషిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ చొరవకు మద్దతు అందించినందుకు ఎన్‌పీసీఐఎల్‌కు లెఫ్టినెంట్ జనరల్ గుర్బీర్‌పాల్ సింగ్ కృతజ్ఞతలు తెలిపారు.

# మంత్రి రోజా జీవిత చరిత్రపై బుక్ రిలీజ్



అమరావతి, మార్చి 22:మంత్రి రోజాకు సంబంధించి జీవిత చరిత్ర బుక్‌ను ఇవాళ విడుదల చేశారు. 'రంగుల ప్రపంచం నుంచి రాజకీయాల్లోకి.. రోజా సెల్వమణి' అనే పేరుతో పుస్తకాన్ని రాశారు. ఈ బుక్‌ను అంబటి రాంబాబు, భూమన కరుణాకర్ రెడ్డిలు విడుదల చేశారు. సినిమాల నుంచి రాజకీయాల్లోకి వచ్చి మంత్రి స్థాయికి ఎలా ఎదిగారనే విషయాలు ఈ పుస్తకంలో పొందుపర్చారు.

సినిమాల్లో స్టార్ హీరోయిన్ గా ఎన్నో వైవిధ్యభరితమైన పాత్రలను పోషించి అనతి కాలం లోనే సౌత్ లో బిగ్గెస్ట్ స్టార్ హీరోయిన్ గా ఎదిగిన నటి రోజా. తెలుగు, తమిళం, మలయాళం భాషల్లో దాదాపుగా అందరి స్టార్ హీరోలతో కలిసి నటించిన ఈమె సినీ కెరీర్ ఎన్నో ఒడిదుడుగులు, ఎత్తుపల్లాలు మధ్య కొనసాగింది. మొదటి నుండి సామాజిక స్పృహ ఉన్న రోజా ప్రజాసేవ చెయ్యడం కోసం తెలుగు దేశం పార్టీ ద్వారా రాజకీయాల్లోకి అడుగుపెట్టింది. నగరి స్థానం నుండి టీడీపీ ద్వారా రెండు సార్లు పోటీ చేసి ఓడిపోయిన రోజా, ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ లో చేరింది. వై ఎస్ రాజశేఖర్ రెడ్డి చనిపోయిన తర్వాత ఆయన తనయుడు జగన్ స్థాపించిన వైసీపీ లో చేరి అదే నగరి స్థానం నుండి రెండు సార్లు పోటీ చేసి ఎమ్మెల్యే గా గెలుపొందింది. అలా అటు సినీ జీవితం లోను, ఇటు రాజకీయ జీవితం లోను ఎన్నో ఆటుపోట్లను ఎదురుకొని మగవాళ్ళతో సమానంగా ఫైర్ బ్రాండ్ గా రోజా ఎదిగారు.

# విశాఖలో డ్రగ్స్ వెనకాల చంద్రబాబు, పురందేశ్వరి, మరికొందరు ?

**– తమకు సమాచారం ఉందన్న వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల**

అమరావతి మార్చ్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);విశాఖలో భారీగా పట్టుబడిన డ్రగ్స్ వెనకాల టిడిపి అధినేత చంద్రబాబు, ఆయన వదిన, ఆంధ్రప్రదేశ్ బిజెపి నేత పురందేశ్వరి, మరికొందరు ఉన్నట్లు తమకు సమాచారం ఉందని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఇంటర్ పోల్ అందించిన సమాచారంతో విశాఖలోని సిబిఐ, కస్టమ్స్ అధికారులు కలసి ఒక ప్రైవేట్ కంటైనర్ లో బ్రెజిల్ నుంచి వచ్చిన 25వేల కిలోల డ్రగ్స్ ను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. దీనిపై సజ్జల శుక్రవారం విలేఖరుల తో మాట్లాడుతూ నిందితులతో తెలుగు దేశం పార్టీ నేతలకు సంబంధాలు ఉన్నట్లు తమకు తెలిసిందన్నారు. దీనినుంచి తప్పించుకునేందుకు తమపై నెపం నెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆయన అన్నారు.రాష్ట్రంలో గంజాయి సాగును చంద్రబాబు పెంచి పోషించారని, తమ ప్రభుత్వ హయాంలో గంజాయి వాడకాన్ని నిర్మూలించేందుకు చర్యలు తీసుకున్నా మని సజ్జల చెప్పారు. ఈ వ్యవహార ంలో తప్పుడు వార్తలు రాస్తున్న పత్రికలపై చర్య తీసుకోవాలంటూ ప్రెస్ కౌన్సిల్ కు లేఖ రాస్తున్నామన్నారు.

# ఎన్నికల ఖర్చుల కోసం ప్రత్యేక ఖాతా తెరవాలి- జిల్లా ఎన్నికల అధికారి




అమరావతి, మార్చి 22:సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా కొత్త బ్యాంకు ఖాతాలను తెరవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. ఎన్నికల వ్యయ పర్యవేక్షణకు సంబంధించి జిల్లా స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో జిల్లాలోని 27ప్రధాన బ్యాంకుల సీనియర్ అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జాయింట్ జాయింట్, కలెక్టర్ ఎం.నవీన్ తో కలిసి ఆయన మాట్లాడారు. అభ్యర్థులు తమ పేరున లేదా వారి ఏజెంట్ తో పాటు జాయింట్ ఖాతాలను కూడా తెరవ వచ్చని తెలిపారు. అభ్యర్థి నామినేషన్ దాఖలు చేయడానికి ఒక రోజు ముందు కూడా ఖాతా తెరవవచ్చని స్పష్టం చేశారు.

బ్యాంకు ఖాతాలు ఏదైనా బ్యాంకు (సహకార బ్యాంకులతో సహా) లేదా పోస్టాఫీసులో కూడా తెరవవచ్చని, అన్ని బ్యాంకులు ప్రత్యేక కౌంటర్‌ను తెరిచి, ప్రాధాన్యతా ప్రాతిపదికన ఖాతాలో డిపాజిట్, ఉపసంహరణలకు వీరికి అనుమతించాలని, అలాగే బ్యాంకుల నుంచి పెద్ద ఎత్తున జరిగే నగదు ఉపసంహరణ లావాదేవీలపై పూర్తిగా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని బ్యాంకులను ఆదేశించారు. జిల్లాలోని 288 వివిధ బ్యాంకుల శాఖలు ప్రతిరోజూ తమకు సూచించిన ఐదు నివేదికలను నిర్దేశిత సమయంలోగా ఈమెయిల్ ద్వారా చేరవేయాలని స్పష్టం చేశారు.

ఏదైనా అనుమానాస్పద లావాదేవీలు జరిగితే బ్యాంకులు జిల్లా ఎన్నికల అధికారికి (డీఈవో) సమాచారం ఇవ్వాలని, రూ.10 లక్షల కంటే ఎక్కువ విత్‌డ్రా అయితే అన్ని బ్యాంకులు డీఈవోకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని, తదుపరి అవసరమైన చర్యల కోసం తాము ఆదాయపు పన్ను శాఖకు సమాచారాన్ని పంపిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో నగదు రవాణా కోసం ఈఎస్ఎంఎస్ పోర్టల్ నుండి బ్యాంకుల ద్వారా క్యూఆర్ కోడ్ రసీదులు తీసుకుని దానిని నగదు రవాణా చేసే వాహనంతో పాటు వచ్చే అధికారికి అందజేయాలని చెప్పారు.

ప్రయాణ సమయంలో, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్ లేదా పోలీసు బృందం తనిఖీ కోసం ఆపినప్పుడు క్యూఆర్ కోడ్ రసీదు చూపాలని, తనిఖీ చేస్తున్న సమయంలో రవాణా చేస్తున్న నగదు వివరాలు, క్యూఆర్ రసీదుతో సరిపోలకపోతే నగదు స్వాధీనం చేసుకుంటారని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ ఎం.సూర్య కిరణ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ ఎంవి. తిలక్, డిసిసిబి సీఈవో వరప్రసాద్, గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆర్ఎం రాఘవేంద్ర, వివిధ బ్యాంకుల ప్రతినిధులు హాజరయ్యారు.

# మల్కాజిగిరి లోక్ సభ ఎన్నికల బరిలో భారత సుదర్శన్

హైదరాబాద్ మార్చ్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);త్వరలో జరుగనున్న ఎన్నికల్లో మల్కాజిగిరి లోక్ సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటీ చేయనున్నట్లు ప్రముఖ సామాజిక ఉద్యమనేత, రాజకీయ సామాజిక విశ్లేషకులు భారత సుదర్శన్ తెలిపారు. సామాజిక న్యాయం, స్థానిక పరిపాలన, సమగ్రాభివృద్ధియే ధ్యేయంగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యమకారుడిగా తెలంగాణ రాష్ట్ర సాధనలో నిస్వార్థంగా రాజీలేని పోరాటం చేశానని, సామాజిక కార్యకర్తగా పలు సంస్థలను స్థాపించి, వాటి ద్వారా ప్రజలకు విద్యా, ఆరోగ్యపరంగానే కాకుండే అనేక రకాల సామాజిక, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి, నిత్యం ప్రజలతో మమేకమై సేవ చేస్తున్నానని భారత సుదర్శన్ తెలిపారు. శుక్రవారం మీడియా సమావేశం లో మాట్లాడుతూ మల్కాజిగిరి లోక్ సభ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తానని సుదర్శన్ తెలిపారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల సమగ్రాభివృద్ధి కోసం, వారి హక్కులను కాపాడేందుకు రాజీలేని పోరాటం చేస్తానన్నారు. త్వరలోనే మల్కాజిగిరి లోక్ సభ నియోజకవర్గ మేనిఫెస్టోను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలోనే కాకుండా తెలంగాణ వ్యాప్తంగా అనేక ప్రజా, కార్మిక, ఉద్యోగ సంఘాలు, కొన్ని రాజకీయ పార్టీలు మరియు తెలంగాణ ఉద్యమకారులు తనకు మద్దతు తెలుపుతున్నారని భారత సుదర్శన్ అన్నారు. ఇప్పటి వరకూ మల్కాజిగిరి లోక్ సభ నియోజకవర్గంలో అభివృద్ధి మేడిపండు చందంగా ఉందని, అనేక మౌలిక సమస్యలతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. ధనస్వామ్య రాజకీయాల వల్ల మల్కాజిగిరి పార్లమెంటు ప్రజలు ఇప్పటికే చాలా నష్టపోయారని, మంచి మార్పు కోసం వచ్చే ఎన్నికల్లో తనను ఎంపీగా ఎన్నుకోవాలని భారత్ సుదర్శన్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

# ప్రేరణనే ప్రాణపదంగా పయనిద్దాం.. జిల్లా జడ్జి




నిజామాబాద్, మార్చి 22: సమాజంలో అందరి జీవన హక్కులు గౌరవిస్తు గౌరవప్రదమైన జీవనగవనాన్ని కొనసాగించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ లు వ్యాఖ్యానించారు. పోక్సో చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, సైబర్ క్రైమ్, తదితర చట్టాలపై రూపొందించిన లఘుచిత్రం అద్భుతమైన కళాఖండమని వారు విశ్లేషించారు. నేరాలు, శిక్షలు, సంస్కరణలు, నేర బాధితులకు పరిహారం, న్యాయ సహాయం, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ సామాజిక సేవ తదితర అంశాలపై చిత్రంలో చిత్రీకరించిన తీరును వారు అభినందించారు. నిజామాబాద్ జిల్లా న్యాయసేవ అధికార సంస్థ రూపొందించిన లఘుచిత్రాన్ని వారు ఉషా మల్టీప్లెక్స్ లో వీక్షించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

బాలలపై ఏ రకమైన హింసనైనా, అఘాయిత్యానైనా అరికట్టడానికి పౌర సమాజ సహకారం చాలా అవసమని జిల్లా జడ్జి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్ పర్సన్ సునీత కుంచాల అన్నారు. బాలల సంరక్షణ, పోషణ, రక్షణకు చట్టం పూర్తి రక్షణగా నిలబడుతుందని ఆమె తెలిపారు. జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ బాల్యవివాహాలు, బాలలతో కూలీ పని చేయించడం, మానవ అక్రమ రవాణాను నిరోధించడానికి జిల్లా యంత్రాంగం అవిరాల కృషి చేస్తున్నదని పేర్కొన్నారు.

క్రిమినల్ నేరాల్లో బాధితులైన వారికి జిల్లా అధికార యంత్రాంగం తగిన పరిహారం అందిస్తూ అండగా నిలబడుతున్నదని కలెక్టర్ తెలిపారు. నేరమయ సంస్కృతిని అంతం చేయడంలో పోలీసుశాఖ శ్రమిస్తున్నదని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ నింగేనవార్ అన్నారు. బాలల, మహిళల భద్రతకు ప్రత్యేక విభాగాలు విధులు నిర్వహిస్తుయని తెలిపారు. ప్రేరణ లఘుచిత్రం వీక్షణ కార్యక్రమంలో న్యాయసేవ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రతిమా రాజ్, న్యాయవాదులు, పరాలీగల్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎంపీ ధర్మపురి మాటలు నమ్మి మోసపోవద్దు- బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్, మార్చి 22:పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మరోసారి ప్రజలను మోసం చేసేందుకే ఎంపీ ధర్మపురి అరవింద్ షుగర్ ఫ్యాక్టరీ పేరిట బాండ్ పేపర్ డ్రామా చేస్తున్నారని?. కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దని బీఆర్ ఎస్ మాజీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు.

హామీలు ఇచ్చి మోసం చేయడంలో సిఎం రేవంత్, ఎంపీ అరవింద్ ఒక్కటే అనీ అన్నారు. ఎన్నికలలో లబ్ధి కోసమే నాటకం ఆడుతున్నాడని ఆరోపించారు. శుక్రవారం నిజామాబాద్ నగరంలోని ఎల్లమ్మ గుట్ట వద్దగల బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ ఎంపీగా గెలవక ముందు షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తానని పాదయాత్ర చేశారని, గెలిచిన తర్వాత ఫ్యాక్టరీని ప్రైవేట్ భాగస్వామ్యంలో తెరిపిస్తానని ఆనాడే హామీ ఇచ్చి చెరుకు రైతులను మోసం చేసిన చరిత్ర ధర్మపురి అరవింద్ దేనని అన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ మధ్యే ప్రధాన పోటీ అని తెలిపారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ ధర్మపురి అరవింద్ పసుపు బోర్డు తీసుకువస్తానని బాండ్ పేపర్ రాసి రైతులను మోసం చేసిన విషయం తెలిసిందేనన్నారు. ప్రధాని మోడీ చేత ప్రకటన చేయించిన ధర్మపురి అరవింద్ పసుపు బోర్డు ఎక్కడ పెట్టారో చూపాలని ప్రశ్నించారు. ఎంపీ ఓట్ల కోసం వచ్చినప్పుడు పసుపు బోర్డు ఎక్కడ అని ప్రజలు అడగాలని తెలిపారు.

ప్రజలు, కార్యకర్తల మద్దతుతో ఎంపీగా గెలుస్తానని బాజిరెడ్డి గోవర్ధన్ ధీమా వ్యక్తం చేశారు. మార్కెట్లో పసుపు పెరుగుదలలో బీజేపీ ప్రమేయం లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి మోసం చేసేందుకు ఎంపీ ధర్మపురి అరవింద్ చెప్పే మాటలని నమ్మొద్దని ప్రజలకు సూచించారు.

ఆహ్వానం

**తెలంగాణ రచయితల సంఘం - జంట నగరాలు**

**వార్షిక సాహిత్య సభలు**

24-03-2024, ఆదివారం

బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్, హైదరాబాద్

ప్రారంభ సభ - ఉ.10 గంటలకు

సభాధ్యక్షులు : కందుకూరి శ్రీరాములు

అధ్యక్షులు, తెలంగాణ రచయితల సంఘం, జంట నగరాలు

సభా ప్రారంభకులు: కె.శ్రీనివాస్ సంపాదకులు, ఆంధ్రజ్యోతి

ముఖ్య అతిథి: కె.శివారెడ్డి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

విశిష్ట అతిథులు: **డా. నందిని సిధారెడ్డి** తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు

**దేశపతి శ్రీనివాస్** ఎం.ఎల్.సి. తెలంగాణ రాష్ట్రం

ఆత్మీయ అతిథులు: **డా. నాళేశ్వరం శంకరం** రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ రచయితల సంఘం

**విరాహత్ అలీ** అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టుల సంఘం

పుస్తకావిష్కరణ

కందుకూరి శ్రీరాములు కవిత్వం - పలకల నుంచి పలుకుల వైపు

పుస్తకాన్ని కె.శివారెడ్డి ఆవిష్కరిస్తారు.

కార్యదర్శి నివేదిక: **డా.బెల్లంకొండ సంపత్ కుమార్**

సందేశాలు : డా.తూర్పు మల్లారెడ్డి, కోశాధికారి, తెరసం, జంటనగరాలు
డా. రూప్ కుమార్ డబ్బీకార్ కవి, రచయిత
కొత్త అనిల్ కుమార్ తెరసం, కరీంనగర్
పొట్లపల్లి శ్రీనివాస రావు తెరసం, వరంగల్
బిల్లా మహేందర్ తెరసం, హనుమకొండ
పానుగంటి రామ్మూర్తి తెరసం, జనగాం
ముత్తి గారి కవిత తెరసం, మెదక్
డా. పొన్నాల బాలయ్య తెరసం, సిద్దిపేట
ఘనపురం దేవేందర్ తెరసం, నిజామాబాద్

ఆహ్వానం: **కొండపల్లి నీహారిణి** కృతజ్ఞతలు: **నరేశ్ చారి**

**భోజన విరామం - మధ్యాహ్నం 1 గం. - 2 గం.**

రెండవ సభ - మ.2 గంటలకు

**సాహిత్యం - సమకాలీనత**

సభాధ్యక్షత: **డా.వి. శంకర్** రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రచయితల సంఘం

**అంశం: కవిత్వం**

వక్త: దర్భశయనం శ్రీనివాసాచార్య ప్రముఖ కవి

**అంశం: కథ, నవల**

వక్త: డా. ఎస్.రజని

తెలుగు శాఖ అధ్యక్షులు, డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

**అంశం: విమర్శ, పరిశోధన**

వక్త: డా. లక్ష్మణ చక్రవర్తి

అసోసియేట్ ప్రొఫెసర్, తెలంగాణ విశ్వవిద్యాలయం

ఆహ్వానం: కందాళై రాఘవాచార్య కృతజ్ఞతలు: నల్లగొండ రమేశ్

**మూడో సభ – సా.4 గంటలకు**

**కవి సమ్మేళనం**

సభాధ్యక్షులు : డా. గండ్ర లక్ష్మణరావు

పాల్గొను కవులు

**కందాళై రాఘవాచార్య, డా. తిరునగరి శ్రీనివాస్,
శ్రీనారా, వేణుశ్రీ, రూప్ కుమార్ డబ్బీకార్,
కొండపల్లి నీహారిణి, దేవనపల్లి వీణావాణి
గజేందర్ రెడ్డి.ఏ, గజవెల్లి దశరథ రామయ్య
దాసరి మోహన్, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, నక్క హరికృష్ణ,
సరోజ వింజామర, ధూళిపాళ అరుణ
నల్లగొండ రమేష్, నరేశ్ చారి, అహోబిలం ప్రభాకర్
ముదిగొండ సంతోష్, కాసిం అలీ, కనకయ్య
జగ్గయ్య జి, బక్కా రెడ్డి .పి, జల్లిపల్లి బ్రహ్మం
వంశీధర్.కె, గుండెల్లి ఇస్తారి, సులోచన.జి
సాలగ్రామగిరి, దుగ్గి గాయత్రి, అఫ్రోజ్ రుక్సానా
బండారు పుష్పలత, భానుజ, కె.నరసింగం
రాధికా సూరి, పద్మశ్రీ, యరకల యాదయ్య, వి.వెంకటాచార్య
కందుకూరి శ్రీరాములు, బెల్లంకొండ సంపత్ కుమార్**

ఆహ్వానం :గజేందర్ రెడ్డి.ఏ కృతజ్ఞతలు: గుండెల్లి ఇస్తారి సమన్వయం: వేణుశ్రీ

సాహిత్యాభిమానులందరికీ స్వాగతం

**తెలంగాణ రచయితల సంఘం - జంట నగరాలు**

# 41వ స్థాయి సమావేశం యూరోపియన్ హైడ్రోజన్ వీక్‌లో 42 వ ఐపిహెచ్ఈ సమావేశాన్ని నిర్వహించనున్న యూరోపియన్ కమిషన్




న్యూఢిల్లీ, మార్చి 22:ఇంటర్నేషనల్ పార్టనర్‌షిప్ ఫర్ హైడ్రోజన్ అండ్ ఫ్యూయల్ సెల్స్ ఇన్ ది ఎకానమీ (ఐపిహెచ్) 41వ స్థాయి సమావేశం ఈ నెల 18న న్యూ ఢిల్లీలో ప్రారంభమయ్యింది. భారతదేశం ఆతిథ్యం ఇస్తున్న సమావేశం 22 వ తేదీ వరకు జరుగుతుంది. సమావేశంలో భాగంగా 2024 మార్చి 20న వివిధ అంశాలపై చర్చలు జరిపింది.

సమావేశంలో ఆస్ట్రియా, చిలీ, ఫ్రాన్స్, యూరోపియన్ కమిషన్, జపాన్, జర్మనీ, నెదర్లాండ్స్,యూఏఈ, యూకే, అమెరికా, సింగపూర్, దక్షిణ కొరియా తో సహా వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. హైడ్రోజన్ వినియోగాన్ని ఎక్కువ చేయడానికి తమ దేశాలు అమలు చేస్తున్న పరిశోధన, అభివృద్ధి, కీలక విధాన పరిణామాలు, కార్యక్రమాలను ప్రతినిధులు సమావేశంలో వివరించారు. తమ దేశాల జాతీయ హైడ్రోజన్ విధానం, హైడ్రోజన్ ఉత్పత్తి, నిల్వ, రవాణా అంశాలకు సంబంధించి అమలు జరుగుతున్న పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలు; డిమాండ్ ,మౌలిక సదుపాయాల అభివృద్ధి,మానవ వనరుల అభివృద్ధి తదితర అంశాలను వివిధ దేశాల ప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు.

హైడ్రోజన్ రవాణా, ఉత్పత్తి, నిల్వ కోసం అమలు చేయాల్సిన వ్యాపార నమూనాలు, అంతర్జాతీయ సహకారం, ఆర్థిక రంగాల్లో భాగస్వామ్యాలు, విధానం, నిబంధనలు, బలమైన హైడ్రోజన్ ఆర్థిక వ్యవస్థను రూపొందించడానికి అవసరమైన స్థిరమైన వాణిజ్య, ఆర్థిక నమూనాలు తదితర అంశాలు సమావేశంలో చర్చకు వచ్చాయి. కమిటీ చర్చించింది.

నియంత్రణ వ్యవస్థ, ఉద్గార పొదుపులు గుర్తించే పద్ధతి, హైడ్రోజన్ రంగానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, మార్కెట్ అవకాశాలు, హైడ్రోజన్ బ్యాంకులు, దిగుమతి-ఎగుమతి కారిడార్‌లపై కూడా ప్రతినిధులు చర్చించారు. ప్రజలకు అవగాహన కల్పించడం, సులభతర వ్యాపార నిర్వహణ, అధిక సామర్థ్యం తో తక్కువ ఖర్చుతో విధానాలు అమలు చేయడం కూడా సమావేశంలో చర్చకు వచ్చాయి.

40వ స్టీరింగ్ కమిటీ నిర్ణయాలు, చర్యలను కూడా కమిటీ సమీక్షించింది. ఐపిహెచ్ సభ్యత్వంపై కూడా చర్చించారు. గ్లోబల్ సౌత్‌లోని దేశాలతో సహా అంతర్జాతీయ సమాజం విస్తృత భాగస్వామ్యాన్ని నిర్ధారించడానికి సభ్యత్వాన్ని ప్రోత్సహించాలని సమావేశం నిర్ణయించింది.

ఈ ఏడాది నవంబర్‌లో జరగనున్న యూరోపియన్ హైడ్రోజన్ వీక్ సందర్భంగా యూరోపియన్ కమిషన్ ఆధ్వర్యంలో 42వ స్టీరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ప్రాధాన్యతా ప్రాతిపదికన ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాల్లో గ్రీన్ హైడ్రోజన్ విస్తరణను వేగవంతం చేయ దానికి చర్యలు అమలు చేయాలని కమిటీ చైర్ సభ్య దేశాలకు సూచించారు.

# కొత్త దిల్లీలో 4వ షాంఘై సహకార సంస్థ (ఎస్సిఓ) స్టార్టప్ ఫోరమ్ నిర్వహణ

న్యూఢిల్లీ, మార్చి 22:షాంఘై సహకార సంస్థ (ఎస్సిఓ) స్టార్టప్ ఫోరమ్ నాల్గవ ఎడిషన్ 19 మార్చి 2024న న్యూఢిల్లీలో నిర్వహించారు. ఈ చొరవ ఎస్సిఓ సభ్య దేశాల మధ్య ప్రారంభ పరస్పర చర్యలను విస్తృతం చేయడం, ఆవిష్కరణలకు అనుకూలమైన వాతావరణాన్ని పెంపొందించడం, ఉద్యోగ కల్పనను ప్రోత్సహించడం, వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి యువ ప్రతిభావంతులను ప్రేరేపించడం లక్ష్యం.

ఫోరమ్ ప్లీనరీ సెషన్‌లో ఎస్సిఓ స్టార్టప్‌ల ప్రతినిధి బృందం, సభ్య దేశాలలో స్టార్టప్‌ల కోసం నోడల్ ఏజెన్సీలు, సీనియర్ ప్రభుత్వ అధికారులు, దౌత్యవేత్తలతో సహా ఎస్సిఓ సభ్య దేశాల నుండి ఈ సదస్సులో పాల్గొన్నారు. పరిశ్రమల ప్రోత్సాహక విభాగం (డిపిఐఐటి), వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ రాజేష్ కుమార్ సింగ్ దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టం కావాలంటే స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ పాత్ర ఎంత ముఖ్యమో వివరిస్తూ కీలకోపన్యాసం చేశారు. డిపిఐఐటి జాయింట్ సెక్రటరీ శ్రీ సంజీవ్ భారతదేశ స్టార్టప్ ప్రస్థానం, భారత ప్రభుత్వం స్టార్టప్‌లను ప్రోత్సహించే కార్యక్రమాల గురించి ప్రతినిధి బృందాన్ని ఉద్దేశించి ప్రసంగించారు.

ఎస్సిఓ పెవిలియన్‌లో జరిగిన ప్రదర్శనలో 15 ఎస్సిఓ స్టార్టప్‌లు తమ ఉత్పత్తులు, సేవలను ప్రదర్శించాయి. ఈ ప్రదర్శన ద్వారా వ్యవస్థాపకులను ప్రేరేపించడానికి, విద్యావంతులను చేయడానికి, సాధికారత కోసం రూపొందించిన నెట్‌వర్కింగ్ అవకాశాలను అందించింది. అంతేకాకుండా, 'పెట్టుబడి నిధిని ఏర్పాటు చేయడం: ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించడానికి వ్యూహాత్మక విధానం' అనే అంశంపై స్టార్టప్ ఇండియా నిర్వహించిన వర్క్‌షాప్‌కు కూడా ప్రతినిధులు హాజరయ్యారు. వర్క్‌షాప్‌లో ప్రారంభ దశ స్టార్టప్‌లకు మద్దతుగా సీడ్ ఫండ్‌ల ఏర్పాటుకు సంబంధించిన వివిధ నమూనాలను అర్థం చేసుకోవడానికి ఒక ఇంటరాక్టివ్ సెషన్‌ను చేర్చారు. వర్క్‌షాప్ పాల్గొనేవారికి సీడ్ ఫండ్ ని ఏర్పాటు చేయడంలో వ్యూహాత్మక ప్రణాళిక, అమలుపై సమగ్ర అవగాహన కల్పించారు.

16 సెప్టెంబర్ 2022న ఉజ్బెకిస్తాన్‌లోని సమర్‌కండ్‌లో జరిగిన ఎస్సిఓ దేశాధినేతల శిఖరాగ్ర సమావేశంలో స్టార్టప్‌లు, ఇన్నోవేషన్ ప్రత్యేక వర్కింగ్ గ్రూప్ (ఎస్డబ్ల్యూజి)ని రూపొందించడానికి అన్ని సభ్య దేశాలు అంగీకరించాయి. ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లడం, వైవిధ్యపరచడంలో ఆవిష్కరణ, వ్యవస్థాపకత ప్రాముఖ్యతను పరిగణనలోకి తీసుకుని, భారతదేశం అంగీకరించింది. ఎస్సిఓ సభ్య దేశాల మధ్య సహకారానికి కొత్త ఆధారాన్ని రూపొందించడానికి 2020లో ఈ చొరవను ప్రతిపాదించింది. ఎస్సిఓ సభ్య దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించే దృష్టితో ఎస్డబ్ల్యూజి రూపకల్పన జరిగింది. ఇది స్టార్టప్ పర్యావరణ వ్యవస్థకు ప్రయోజనం చేకూర్చడమే కాకుండా ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేస్తుంది. 2023లో, డిపిఐఐటి అధ్యక్షతన జరిగిన అనేక రౌండ్ల సమావేశాల తర్వాత, ఎస్సిఓ లో భారతదేశం శాశ్వతంగా అధ్యక్షత వహించడానికి ఎస్డబ్ల్యూజి నిబంధనలను ఆమోదించాలని సభ్య దేశాలు నిర్ణయించాయి.

డిపిఐఐటి స్టార్టప్ పర్యావరణ వ్యవస్థల కోసం వివిధ కార్యక్రమాలను నిర్వహించింది. అటువంటి చొరవకు నేతృత్వం వహించడం ద్వారా, భారతదేశం ఇన్నోవేషన్ పాదముద్రను విస్తరించడానికి, మొత్తం పర్యావరణ వ్యవస్థను ఒకదానితో ఒకటి కలపడానికి, ఇతర ఎస్సిఓ సభ్య దేశాలను ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడానికి ఇదొక అవకాశం. స్టార్టప్ ఎంగేజ్‌మెంట్‌లను ఎస్సిఓ సభ్య దేశాలలో స్థానిక స్టార్టప్ పర్యావరణ వ్యవస్థలను బలోపేతం చేయడం, పెట్టుబడిదారులు, కార్పొరేట్ ఎంగేజ్‌మెంట్ కార్యకలాపాలకు మార్గనిర్దేశం చేయడం, యాక్సెస్ చేయడం ద్వారా స్టార్టప్‌లకు విలువను అందించడం అనే లక్ష్యంతో భారతదేశం నిర్వహిస్తుంది. భారతదేశం నవంబర్ 2024లో ఎస్డబ్ల్యూజి రెండవ సమావేశానికి, జనవరి 2025 లో ఎస్సిఓ స్టార్టప్ ఫోరమ్ 5.0కి ఆతిథ్యం ఇవ్వనుంది. అంతకు ముందు స్టార్టప్ ఇండియా ఎస్సిఓ సభ్య దేశాల కోసం వివిధ కార్యక్రమాలను నిర్వహించింది.

# కుష్టు వ్యాధి అంటువ్యాధే కానీ ...సులభముగా సోకదు



హైదరాబాదు మార్చ్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కుష్టు వ్యాధి అంటువ్యాధి అయినప్పటికి అంత సులభంగా మరొకరికి శోకదని మదర్ మేరి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ సాయి చౌదరి అన్నారు. మార్చి 11 నుండి మార్చి 24 తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమం ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని, నేడు జన్మభూమి కాలనీ యందు నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా సాయి చౌదరి మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తులతో ఎక్కువ కాలం సహవాసం చేస్తే సోకే అవకాశాలు ఎక్కువ అని, సాధారణంగా నోటి దుంపల ద్వారా ఇది వ్యాపిస్తుందని, వ్యాధి సోకిన దాదాపు 3 నుంచి 15 సంవత్సరముల అనంతరం దీని దుష్పరిణావాలు బయటపడతాయని, శరీరంపై ఎక్కడైనా తెల్లా లేదా రాగి రంగు మచ్చలు మెరుస్తున్నట్లుగా గమనిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకుని చికిత్స పొందితే వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చని సాయి చౌదరి తెలిపారు. ఈ సర్వేలో కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నట్లు అయితే వారిని దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేస్తామని ప్రభుత్వ ఆసుపత్రిలోని డాక్టర్లు అనుమానిత కుష్టు వ్యాధిగ్రస్తులను పరీక్షించి ఒకవేళ కుష్టు వ్యాధి అని నిర్ధారణ అయితే వెంటనే కుష్టు వ్యాధికి సంబంధించిన మందులను ఉచితంగా ఇచ్చి చికిత్స నిర్వహిస్తారని సాయి చౌదరి తెలిపారు.

# హైతీ నుంచి భారతీయులు తరలింపు




న్యూఢిల్లీ, మార్చి 22:గ్యాంగ్ వార్‌తో కల్లోలంగా మారిన హైతీ దేశం నుంచి భారతీయులను తరలించేందుకు కేంద్రం "ఆపరేషన్ ఇంద్రావతి''ని ప్రారంభించింది. కరేబియన్ దేశమైన హైతీలో సాయుధ ముఠాలు అక్కడి అధికారాన్ని చేజిక్కించుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఆ దేశంలో ఉన్న భారతీయులను సమీపంలో డొమినికన్ రిపబ్లిక్‌కి తరలించేందుకు ఈ ఆపరేషన్ ప్రారంభించినట్లు విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ప్రకటించారు. ..

కాగా ఈ దేశంలో గ్యాంగ్ స్టర్, బార్బెక్యూగా ప్రసిద్ధి చెందిన జిమ్మి చెరిజియన్ నేతృత్వంలోని సాయుధ ముఠాలు హైతీని హస్తగతం చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఆ దేశంలో ఉన్న 12 మంది భారతీయులను సురక్షితంగా తరలించారు. హింసతో అట్టుడుకుతున్న హైతీలో పరిస్థితులను సమీక్షించి, భారతీయులను అక్కడి నుంచి తరలిస్తామని గతంలోనే భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ చెప్పారు. ఈ నేపథ్యంలోనే హైతీలో ఉంటున్న 12 మందిని సమీపంలోని డొమినిక్ రిపబ్లిక్ కు తరలించారు..

# కాంగ్రెస్ హమీలన్నీ తుస్సే.. రేగా కాంతారావు

**-మాయమాటలతో మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం**
**-100 రోజుల్లో అమలు చేస్తామన్న హమీలు బుట్టదాఖలే**
**-కరెంటు కోతలతో ప్రజలు ఇక్కట్లు**
**-భద్రాద్రి రామయ్య అశీసులతో ఐదేళ్లు కాంగ్రెస్ పాలన జరగాలే**
**--పశ్నించే హక్కు ఇచ్చారు. ప్రజల పక్షాన కడిగి పారేస్తాము**
**భద్రాద్రి బిఅర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు**




ఖమ్మం, మార్చి 22: కాంగ్రెస్ పార్టీ గెలిచిన 100 రోజులోనే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని చెప్పి అమలు చేయలేదని.. అన్ని తుస్సే అని భద్రాద్రి కొత్తగూడెం బీఅర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. శుక్రవారం మణుగూరు బీఅర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అయన మాట్లాడుతూ భద్రాద్రి రాముని ఆశీస్సులతో కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు సంవత్సరాల పాటు పరిపాలనలో కొనసాగాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే గట్టిగా ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, 100 రోజుల పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు.

ప్రజా పాలన పేరుతో గ్రామసభలు నిర్వహించి, ప్రజల వద్ద నుండి స్వీకరించిన దరఖాస్తులు ప్రైవేటు వ్యక్తుల చేతిలో రోడ్డుపాల య్యాయన్నారు. రైతులకు రైతుబంధు ఇసామన్న కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజులు దాటినా కూడా రైతుబంధు ఇవ్వకుండా కాలయాపన చేస్తుందన్నారు. రైతుబంధు రూ.15 వేలు, కూలీలకు రూ.12వేలు ఇస్తామన్న కాంగ్రెస్ హామీలు 420 హమీలే అని ఎద్దేవా చేశారు. ఉచిత కరెంటు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. కోతలతో తెలంగాణ రాష్ట్ర ప్రజలను ఉక్కిరి, బిక్కిరి చేస్తోందని విమర్శించారు. రైతుల పంటలు కరెంటు కోతలతో ఎండిపోతున్నాయని, వాటర్ ట్యాంకులు పెట్టి మరీ పంటలను కాపాడుకుంటున్నారని, కొంతమంది రైతులయితే పంటలను కాపాడుకోలేని పరిస్థితిలో తగులబెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

ఇదేనా కాంగ్రెస్ ప్రజా పాలన అంటూ ప్రశ్నించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతి రైతుకు సీజన్లు రాగానే రైతు ఖాతాల్లో రైతుబంధు డబ్బులు సమయానికి జమ అయ్యాయన్నారు. కనీసం కరెంటు పోయిన దాఖలాలు కూడా లేవని, రెండు పంటలను రైతులు పండించుకునారన్నారు. కాంగ్రెస్ అరు గ్యారంటీలో 13 అంశాలు ఉన్నాయని, వాటిలో ఒక్క పథకం కూడా పూర్తిగా అమలు కాలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ఫ్రీ సర్వీసు, ఆరోగ్య శ్రీ, 500లకే ఉచిత గ్యాస్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఖాతాలు పెట్టి అమలు చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయల అప్పు చేసిందన్నారు. అభివృద్ధి పథంలో కొనసాగుతున్న తెలంగాణ రాష్ట్రాన్ని.. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని తిరోగమనం వైపు అడుగులు వేయిస్తుందన్నారు. నేటికి కూడా వితంతువు, వృధాప్య పించన్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే.. దమ్ముంటే అర్హులైన ప్రతీ మహిళకు రూ.2500 ఇవ్వాలని, అర్హులందరికీ పెంచిన పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రైతన్నలకు అధికారంలోకి వచ్చిన వెంటనే 9వ తేదీన రుణమాఫీ చేస్తానని చెప్పి కల్లబొల్లి మాటలు చెప్తుందని, సీఎం రేవంత్ రెడ్డి ఇంకా ఎన్ని తొమ్మిది తారీఖులు రాలేదని ప్రశ్నించారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ఆరు గ్యారంటీ పథకాలు నేరవేరుస్తామని చెప్పడం సీఎం రేవంత్ రెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ మాట ఎన్నికలకు ముందు ఎందుకు చెప్పలేదని అన్నారు. మహాలక్ష్మి పథకంతో పాటు తులం బంగారం ఎక్కడ అంటూ ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను నేరవేర్చకుంటే కాంగ్రెస్ పార్టీని చీల్చి చెండాడుతామని, కర్రకాలిచి వాత పెడతామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయకపోతే ఊరుకునేది లేదన్నారు. ఈ సమావేశంలో మణుగూరు జెడ్పిటిసి పోశం నరసింహారావు, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు అడపా అప్పారావు, ముత్యం బాబు, సొసైటి చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# సరిహద్దు బోర్డర్ చెక్ పోస్టలలో తనిఖీలు పక్కగా చేపట్టాలి

**-మెదక్ జిల్లా కలెక్టర్ మరియు ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ విస్తృత తనిఖీ లు,**

మెదక్, మార్చి 22:(నేటినిజం ప్రతినిధి):పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బోర్డర్ చెకోపోస్టుల్లో వాహనాల తనిఖీలు పక్కాగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ మరియు ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ అధికారుల కు సూచించారు. శుక్రవారం మెదక్ నియోజకవర్గం హవేలి ఘనపూర్ మండల్ లోని పోచమ్మ రాల్ వద్ద ఏర్పాటుచేసిన జిల్లా బార్డర్ చెక్ పోస్ట్ ను ఆర్డీవో రమాదేవి తహశీల్దార్ తో కలసి ఆకస్మికంగా పరిశీలించారు. ముందుగా జిల్లా కలెక్టర్ రిజిస్టర్ లను పరిశీలించి ఈ సందర్భంగా స్టాటిక్ సర్వే లెన్స్ బృందాలకు దిశా నిర్దేశం చేశారు. ఎన్నికలను పారదర్శకం గా నిర్వహించేందుకు నగదు, బంగారం, ఇతరత్రా కానుకల పంపిణీ చేసే అవకాశం ఉన్నందున ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు.

తనిఖీల ప్రక్రియను వీడియో చిత్రీకరణ చేయాలన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఫ్లయింగ్స్క్వాడ్, స్టాటిస్టికల్ అకౌంటింగ్, వీడియో సర్వేలెన్స్, వ్యయ పరిశీలకుల బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా సరైన ఆధారాలు లేకుండా భారీ ఎత్తున నగదు, బంగారం వంటివి తరలిస్తే వెంటనే సీజ్ చేసి సంబంధిత అధికారులకు అప్పగించాలన్నారు. సీజ్ చేసిన వస్తువులకు వివరాలు కూడిన రశీదులను అందజేయాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రమాదేవి, తాహసిల్దార్ నారాయణ , ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు పాల్గొన్నారు.

# వేసవిలో వన్య ప్రాణులకు ప్రత్యేక రక్షణ కల్పించాలి- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, మార్చి 22:స్థానిక మెదక్ జిల్లా పోచారం లో ఉన్న వన విజ్ఞాన కేంద్రన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సందర్శించారు. 4.5 కిలో మీటర్లు సఫారీ వాహనం లో అటవీ ప్రాంతం తిరిగి జింకల ప్రత్యుత్పత్తి కేంద్రంను జింకలని, నెమళ్ళు,మనుబోతులు,పక్షులను,ఇతర అటవీ జంతువులను చూశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి కాలంలో ఎండలు ఎక్కువ గా ఉండడం వల్ల వన్య ప్రాణులకు ప్రత్యేక రక్షణ కల్పించాలని ,జంతువులకు ఆహారం ,త్రాగు నీరు అందించాలని అధికారులను ఆదేశించారు. వన విజ్ఞాన కేంద్రం ఏర్పాటు,అటవీ విస్తీర్ణం, సందర్శకుల సమయ పాలన గురించి అటవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అట జంతువులకు త్రాగు నీరు,ఆహారం ,రక్షణ ఏ విధంగా ఇస్తారు అని అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీఓ రమాదేవి, హవేలీ ఘనపూర్ మండల్ తహసిల్దార్ నారాయణ,అటవీ సెక్షన్ అధికారి శ్రావణ్ కుమార్, బీట్ ఆఫీసర్ ప్రసాద్ గౌడ్, అటవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తాను తప్పు చేసినట్టు నిరూపిస్తే దేనికైనా సిద్ధమే: రఘురామకృష్ణరాజు

అమరావతి మార్చ్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: తాను తప్పు చేసినట్టు నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనని, సంధ్య ఆక్వా కంపెనీ పేరిట బుక్ అయిన కంటైనర్‌లో డ్రగ్స్ దొరికాయని ఎంపి రఘురామకృష్ణరాజు తెలిపారు. విశాఖపట్నం డ్రగ్స్ ఘటనపై ఎంపి రఘురామకృష్ణరాజు స్పందించారు. డా కెవి ప్రసాద్, కూనం వీరభద్రరావు కలిసి సంస్థను స్థాపించారు. సంధ్య మెరైన్, సంధ్య ఆక్వా కంపెనీలు విజయవంతంగా నడిపిస్తున్నారని వెల్లడించారు. కొన్నేళ్ల క్రితం డా కెవి ప్రసాద్, కూనం వీరభద్రరావు విడిపోయారని, సంధ్య కంపెనీ పర్యావరణ నిబంధనలు పాటించడంలేదని ఇబ్బంది పెట్టారని, ఇప్పుడు కంపెనీ పర్యావరణ నిబంధనలు పాటించడంలేదని సాక్షిలో కథనం వచ్చిందని కృష్ణరాజు పేర్కొన్నారు.

# నాగర్ కర్నూలు, మెదక్ బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థులుగా ఆర్ఎస్ ప్రవీణ్, వెంకట్రామిరెడ్డి

హైదరాబాద్ మార్చ్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); నాగర్ కర్నూలు, మెదక్ పార్లమెంటు స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించింది.

నాగర్ కర్నూలునుంచి ఆర్ఎస్ ప్రవీణ్ కు మార్ ను, మెదక్ నుంచి పి. వెంకట్రా మిరెడ్డిని పోటీకి దించుతు న్నట్లు పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటిం చారు.

కాగా భువనగిరి, నల్లగొండ, సికింద్రాబాద్, హైదరాబాద్, చేవెళ్ల స్థానాలకు ఇంకా పార్టీ అభ్యర్థులను ప్రకటించవలసి ఉంది.

గతంలో 10 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈమేరకు కరీంనగర్ నుంచి వినోద్ కుమార్, పెద్దపల్లినుంచి కొప్పుల ఈశ్వర్, మహబూబ్ నగర్ నుంచి మన్నె శ్రీనివాసరెడ్డి, జహీరాబాద్ నుంచి గాలి అనిల్ కుమార్, ఖమ్మంనుంచి నామా నాగేశ్వరరావు, మహబూబాబాద్ నుంచి మాలోతు కవిత, మల్కాజిగిరినుంచి రాగిడి లక్ష్మారెడ్డి, ఆదిలాబాద్ నుంచి ఆత్రం సక్కు, నిజామాబాద్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్, వరంగల్ నుంచి కడియం కావ్య పోటీ చేయనున్నారు.

# అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని నిర్వహించిన నేషనల్ జూలాజికల్ పార్క్

న్యూఢిల్లీ, మార్చి 22:2024 మార్చి 21 న నేషనల్ జూలాజికల్ పార్క్(ఢిల్లీ జూ ) లో అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ ఏడాది 'అడవులు, ఆవిష్కరణలు: మెరుగైన ప్రపంచానికి కొత్త పరిష్కారాలు' అనే ఇతివృత్తంతో అంతర్జాతీయ అటవీ దినోత్సవం జరిగింది. మొక్కల ప్రాధాన్యత, దైనందిన జీవితంలో మొక్కల ప్రాముఖ్యత పై సందర్శకులకు అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేషనల్ జూలాజికల్ పార్క్ లోని ఎడ్యుకేషన్ సెంటర్ లో డూడుల్ ఆర్ట్ తో ఈ కార్యక్రమం ప్రారంభమయ్యింది. కార్యక్రమంలో సందర్శకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తరువాత మిషన్-లైఫ్ పై ఒక చలనచిత్రాన్ని ప్రదర్శించారు. అనంతరం సందర్శకుల కోసం ఇటీవల పునరుద్ధరించిన జలాశయం పరిసరాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. నేషనల్ జూలాజికల్ పార్కు సిబ్బంది మొక్కలు నాటారు.

వాతావరణంలో వస్తున్న మార్పుల ప్రభావాన్ని తట్టుకోవడానికి అడవులను రక్షించడానికి పటిష్ట చర్యలు అమలు చేయాల్సి ఉంటుంది. అటవీ సంరక్షణ ద్వారా భావితరాలకు శ్రేయస్సు సంక్షేమం అందించడానికి అవకాశం కలుగుతుంది. వినూత్న చర్యలను అమలు అమలు చేసి సహజ వనరులను రక్షించవలసిన బాధ్యతను ప్రతి ఒక్కరు తీసుకోవాలి.

# రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసమే ఎన్‌డీఏలో చేరాం : చంద్రబాబు

అమరావతి మార్చ్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలుగుదేశం పార్టీ (టీడీపీ) లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు అభ్యర్థుల మూడో జాబితాను శుక్రవారం విడుదల చేసింది. పార్లమెంటుకు 13 మంది, రాష్ట్ర అసెంబ్లీకి 11 మంది అభ్యర్థులను ప్రకటించింది. ఈ సందర్భంగా తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు ప్రెస్‌మీట్‌లో స్పందిస్తూ.. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసమే జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డీఏ)లో చేరామన్నారు. పార్లమెంట్‌లో రాష్ట్ర ప్రయోజనాల కోసం గట్టిగా ప్రాతినిధ్యం వహించే, దాని కోసం పోరాడే అభ్యర్థులను పార్టీ బరిలోకి దింపుతోందని ఆయన పేర్కొన్నారు. లోక్‌సభకు 13 మంది టీడీపీ అభ్యర్థులు, మరో 11 మంది అసెంబ్లీ స్థానాలకు ప్రజాభిప్రాయం మేరకే అభ్యర్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రజల మద్దతును కోరుతూ చంద్రబాబు ఒక ట్వీట్‌ను కూడా చేశారు. తాజా జాబితాలో బోడే ప్రసాద్, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వసంత కృష్ణప్రసాద్, అయితాబత్తుల ఆనందరావు వంటి అభ్యర్థులకు అవకాశం కల్పించారు.

# పండితాపురంలో జాతర కార్యక్రమం నేటితో ముగింపు

## - ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న మేకల మల్లిబాబు యాదవ్, బోడెపుడి విఠల్ రావు



ఖమ్మం, మార్చి 22:(నేటినిజం ప్రతినిధి): పండితాపురంలో ఈనెల 19 నుండి 22 వరకు జరిగిన శ్రీ పార్వతి సమేత రామలింగేశ్వర కళాణం ఉత్సవాలు, జాతర కార్యక్రమం పూర్ణాహుతి కార్యక్రమంతో ముగిసింది. డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు సీనియర్ న్యాయవాది బోడెపూడి విఠల్ రావు నేతృత్వంలో కొమ్మినేపల్లి, కొండాయిగూడెం, పండితాపురం భక్త బృందం సహకారంతో ఉత్సవ కార్యక్రమాలు ఘనంగా ముగిశాయి. మొదటిరోజు తోరణాలంకరణ దేవుని పెండ్లి కుమారుని చేయుట విశ్వక్సేన పూజ, రెండవ రోజు అర్ధరాత్రి 12 గంటలకు స్వామివారి కల్యాణం, మూడవరోజు గ్రామంలో భారీ ఎత్తున దేవుని ఊరేగింపు కార్యక్రమం, నాలుగవ రోజు వేదమంత్రాలు మధ్య అగ్నిదేవుని ఆవాహన చేసి, మహా పూర్ణాహుతి కార్యక్రమం చేసి, ఉత్సవాలు ముగిసినట్లుగా ప్రకటించడం జరిగింది. తదనంతరం వసంత పంచమి వేడుకలుగా భక్తజనాలు రంగులు చల్లుకుని పులకించిపోయారు. ఈ నాలుగు రోజులపాటు ఎంతో క్రమశిక్షణతో కళ్యాణోత్సవము, జాతర కార్యక్రమాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరిని మల్లి బాబు యాదవ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులతో పాటు మాజీ సర్పంచ్ బానోతు నరసింహ నాయక్, మేకల మల్లికార్జునరావు, మేకపోతుల మహేష్, భూక్యా నాగేంద్రబాబు, పాటిబండ్ల ప్రసాద్, మేకల లక్ష్మీనారాయణ, తొండల ముత్తయ్య, జలగం శ్రీను, జక్కంపూడి వెంకటేశ్వర్లు, తోటకూర భద్రయ్య, జన్నారపు లింగయ్య, బండి లక్ష్మి నర్సు, బండి ఎల్లయ్య, బద్దల శేఖర్, దేరంగుల తిరుపయ్య, బత్తుల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# ముందు కరెంట్ సంగతి చూడు.. రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఫైర్

హైదరాబాద్, మార్చి 22:పార్టీల గేట్లు ఎత్తుతానంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. నువ్వు గేట్లు ఎత్తి రాజకీయాలు చేస్తే.. కరెంటు సంగతి ఎవరు చూడాలని మండిపడ్డారు. శుక్రవారం బీజేపీ కార్యాలయంలో మీడియాతో లక్ష్మణ్ మాట్లాడారు. కమిషన్ల కోసం ప్రైవేటు సంస్థల నుంచి విద్యుత్ కొనడానికి సీఎం రేవంత్ రెడ్డి ప్లాన్ చేస్తున్నారని లక్ష్మణ్ అన్నారు. విభజన చట్టానికి అనుగుణంగా తెలంగాణ వాటా కింద ఎన్టీపీసీలో 4 వేల మెగావాట్ల ప్లాంట్ నిర్మించి.. ఇందులో 85 శాతం వాడుకునేందుకు వీలు ఉందని లక్ష్మణ్ చెప్పారు. ఇప్పటికే 1600 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి మొదలవ్వగా.. మిగతా యూనిట్లకు సంబంధించి ఎన్టీపీసీ వరుసగా లేఖలు రాస్తుందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత జనవరిలోనే ఎన్టీపీసీ రెండుసార్లు లేఖలు రాసిందని.. అయినా రేవంత్ రెడ్డి పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం స్పందించకపోతే ఆ విద్యుత్‌ను వేరే రాష్ట్రానికి మళ్లిస్తామని ఎన్టీపీసీ హెచ్చరికలు చేస్తుందని చెప్పారు.

# నెంబర్ ప్లేట్ లేకుండా రోడ్లపై తిరుగుతున్న 13 ద్విచక్ర వాహనాలపై కేసులు నమోదు : ట్రాఫిక్ ఏసీపీ




ఖమ్మం, మార్చి 22:(నేటినిజం ప్రతినిధి): నంబర్ ప్లేట్ లేకుండా ఉన్న లెటర్స్ ను తొలగించి నగరంలో చక్కర్లు కొడుతున్న 13 ద్విచక్ర వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు నగరంలో నిబంధనలు అతిక్రమించి రోడ్లపై నడుపుతున్న వాహనాలపై నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. తనిఖీలో భాగంగా శుక్రవారం పలు కూడళ్ళలో నెంబరు లేకుండా తిరుగుతున్న ద్విచక్ర వాహనాలను గుర్తించి, కేసులు నమోదు చేసేందుకు ఖమ్మం వన్ టౌన్, టూ టౌన్ ,త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లకు తరలించినట్లు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడుపుతున్న వారు చలనాల నుండి తప్పించుకోవడంతో పాటు ట్రాఫిక్ పోలీసులు గుర్తించకుండా ఉండేందుకు రిజిస్ట్రేషన్ నంబర్ లోని టీఎస్, ఏపీ అక్షరాలతో పాటు చివరి రెండు నంబర్లు కనిపించకుండా స్టిక్కర్స్, ప్లాస్టర్స్,మాస్క్ లు వేస్తున్నారని తెలిపారు. కొన్ని వాహనాలకు ముందు నంబర్ ప్లేట్ కరెక్ట్ గా ఉన్నప్పటికీ వెనుక నంబర్ ప్లేట్ మాత్రం బెండ్ చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి రాంగ్ నెంబర్ ప్లేట్లతో రోడ్లపై ఇష్టమొచ్చినటుగా ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారని పెర్కొన్నారు. నంబర్ లేని బైక్స్ పై చైన్ స్నాచర్లు నేరాలు చేస్తూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. నంబర్ ప్లేట్ లేని వికృతమైన నంబర్ ప్లేట్‌లను కలిగిన వాహనాలపై 420/511, ఎంవీ చట్టం కింద కేసులు నవోదు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఏసీపీ తెలిపారు.

# బీఆర్ఎస్‌లో ఎందుకు చేరారో అసలు విషయం చెప్పిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, మార్చి 22: తన రాజకీయ ప్రస్థానంలో ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలు మిమ్మల్ని బాధ పెట్టి ఉండవచ్చని శ్రేయోభిలాషులను ఉద్దేశించి నాగర్‌కర్నూలు పార్లమెంటు అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఒక ఉన్నతమైన లక్ష్య సాధన కోసం కొన్ని త్యాగాలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. అయితే ఈ విషయాన్ని అర్థం చేసుకోకుండా.. తన మీద సోషల్‌మీడియా వేదికగా కొన్ని శక్తులు ( కొంతమంది ఆప్తులతో సహా ) తీవ్రమైన దాడి చేశాయని.. ఇంకా చేస్తూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అనాగరికమైన దాడులు తనకు కొత్త కాదని తెలిపారు. పేద ప్రజల జీవితాలను సమూలంగా మార్చాలన్న లక్ష్యం నుంచి తనను ఈ చిల్లర రాజకీయాలు దూరం చేయలేవని స్పష్టం చేశారు. తన మీద నమ్మకంతో నాగర్‌కర్నూలు బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించినందుకు కేసీఆర్‌కు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.

ఇన్నాళ్లూ పీడిత ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేశానని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. చట్టసభల్లో కూడా మీ గొంతుకగా ఉండాలనే లక్ష్యంతో.. ఎంతో విలువైన ఉద్యోగాన్ని సైతం వదిలి రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. అసెంబ్లీలో బహుజనుల గొంతుకగా ఉండాలని రాత్రింబవళ్లు శ్రమించినా మొదటి ప్రయత్నంలో విఫలమయ్యానని అన్నారు. తెలంగాణ వాదం ? బహుజనవాదం రెండూ ఒక్కటేనని నమ్మి ఎంతో శ్రమించి కేసీఆర్, మాయావతిని ఒప్పించి తెలంగాణలో చారిత్రాత్మక పొత్తు ఏర్పాటయ్యేలా చూశానని చెప్పారు. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల అది చివరి నిమిషంలో రద్దయ్యిందని అన్నారు. ఇచ్చిన మాట మేరకు విశాల తెలంగాణ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, దేశంలో కోట్లాది బహుజనుల బంగారు భవిష్యత్తు కోసం, భారత రాజ్యాంగ విలువల రక్షణ కోసం, కేసీఆర్‌తోనే కలసి ప్రయాణించాలనుకున్నా అని తెలిపారు. బీజేపీ కుట్రల నుంచే దేశాన్ని రక్షించే దమ్ము-ధైర్యం కాంగ్రెస్‌కు ముమ్మాటికీ లేదని..అందుకే ఇటీవల బీఆర్ఎస్‌లో చేరానని స్పష్టం చేశారు.

నేను చట్టసభలో కూర్చుంటే.. మీరందరూ అక్కడ కూర్చున్నట్లే

ఈ యుద్ధంలో కేసీఆర్ మార్గదర్శనంలో సర్వశక్తులొడ్డి విజయం కోసం పోరాడతానని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. దయచేసి తనతో కలిసి రావాలని.. చేతనైతే సాయం చేయాలని పిలుపునిచ్చారు. ‘ మీ విలువైన సమయం ఇచ్చి.. నాగర్‌కర్నూలు నియోజకవర్గానికి వచ్చి కారు గుర్తుకు ఓటేయ్యాలని ఇంటింటికి ప్రచారం చేయండి.. లేదా మీకు తెలిసిన వారందరికీ కనీసం ఫోన్ చేసి అయినా చెప్పండి’ అని కోరారు. తాను చట్టసభల్లో కూర్చుంటే మీరందరూ అక్కడ కూర్చున్నట్టే.. నేను నేను కాదు.. నేను మీరే అని తెలిపారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరు బిజెపికి బీ టీమ్ గా ఉంది

హైదరాబాద్ మార్చ్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బిఆర్ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ మద్యం కేసులో కాంగ్రెస్ హైకమాండ్ ది ఒకదారి.. రేవంత్ ది మరోదారి అన్నట్లు ఉందని హరీశ్ రావు ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరు బిజెపికి బీ టీమ్ గా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ తీరుకు వ్యతిరేకంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని తెలిపారు. ఖర్గే, రాహుల్ నాయకత్వంలో రేవంత్ రెడ్డి పనిచేయడం లేదని, కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు.

# మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ బ్లూ ఎకానమీపై ఇంటర్-మినిస్టీరియల్ జాయింట్ వర్క్‌షాప్




న్యూఢిల్లీ, మార్చి 22:మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ (ఓఎంఈఎస్) బ్లూ ఎకానమీ పాత్‌వేస్ స్టడీ రిపోర్ట్ స్టేటస్‌పై ఈరోజు న్యూఢిల్లీలో కన్సల్టేటివ్ వర్క్‌షాప్‌ను నిర్వహించింది. ప్రపంచ బ్యాంకు నిపుణులు, గణాంకాలు మరియు కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ, పర్యావరణం, అటవీ ఉ వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, మత్స్య, పశుసంవర్ధక మరియు పాడి పరిశ్రమ మంత్రిత్వ శాఖ, నీతి ఆయోగ్, పోర్ట్ షిప్పింగ్ మరియు జలమార్గాల మంత్రిత్వ శాఖ, పర్యాటక మంత్రిత్వ శాఖ మరియు వివిధ రాష్ట్ర మరియు జాతీయ ఖీడఆ సంస్థలు పాల్గొన్నారు. వర్క్‌షాప్ సందర్భంగా, నివేదిక తయారీలో ప్రతి లైన్ మంత్రిత్వ శాఖ యొక్క సహకార పాత్రపై చర్చించారు.

మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ ఒక సాంకేతిక అధ్యయనాన్ని చేపట్టడానికి మరియు ‘ఇండియాస్ బ్లూ ఎకానమీ: పాత్‌వేస్ ఫర్ రిసోర్స్-ఎఫిషియెంట్, ఇన్‌క్లూసివ్ అండ్ రిసెలెంట్ గ్రోత్ ఇన్ ఇండియా’ అనే పేరుతో ఒక సెమినల్ రిపోర్టును సిద్ధం చేయడానికి నాలెడ్జ్ పార్టనర్‌గా ప్రపంచ బ్యాంక్‌తో నిమగ్నమై ఉంది. బ్లూ ఎకానమీ ఇంప్లిమెంటేషన్, ఓషన్ అకౌంటింగ్ ఫ్రేమ్‌వర్క్, సంస్థాగత బలోపేతం మరియు బ్లూ ఎకానమీ పాలసీ ఫ్రేమ్‌వర్క్‌ను అమలు చేయడానికి వినూత్న ఫైనాన్స్ మెకానిజమ్స్‌లో ప్రపంచ ఉత్తమ అభ్యాసాలకు సంబంధించిన రంగాలను నివేదిక అవుట్‌పుట్‌లు కవర్ చేయాలని భావిస్తున్నారు.

నేడు, బ్లూ ఎకానమీ ఆర్థిక వృద్ధి మరియు శ్రేయస్సు యొక్క తదుపరి గుణకం అని వాగ్దానం చేస్తుంది, వ్యూహం కేంద్ర దశలో స్థిరత్వం మరియు సామాజిక-ఆర్థిక సంక్షేమాన్ని ఉంచుతుంది. తీర ప్రాంత ప్రజల జీవితాలను గణనీయంగా మెరుగుపరచడం, మన సముద్ర పర్యావరణ వ్యవస్థలను సంరక్షించడం మరియు మన సముద్ర ప్రాంతాల భద్రతను నిర్వహించడం దీని లక్ష్యం. బ్లూ ఎకానమీ ఒక మిశ్రమ ప్యాకేజీలో బ్లూ ఎకానమీకి సంబంధించిన అన్ని విషయాలపై, అంటే వ్యూహాత్మక, శాస్త్రీయ, రాజకీయ, పర్యావరణ మరియు ఆర్థిక ప్రయోజనాలపై భారతదేశంలో అత్యాధునిక ఆసక్తి అత్యాధునిక మరియు భవిష్యత్తు శాస్త్ర మరియు సాంకేతిక పరిశోధన యొక్క మొత్తం పర్యావరణ వ్యవస్థను రూపొందిస్తుంది.

భారతదేశానికి ప్రత్యేకమైన సముద్రతీర స్థానం ఉంది. దాని 7,517 కి.మీ పొడవైన తీరప్రాంతం మరియు రెండు మిలియన్ల చదరపు కి.మీలకు పైగా ఉన్న ప్రత్యేక ఆర్థిక మండలి (ఇఇజి) జీవన మరియు నిర్జీవ వనరులతో సమృద్ధిగా ఉంది. తీరప్రాంత ఆర్థిక వ్యవస్థ 4 మిలియన్లకు పైగా మత్స్యకారులను మరియు ఇతర తీర ప్రాంత వర్గాలను కూడా కొనసాగిస్తుంది. ఈ విస్తారమైన సముద్ర ప్రయోజనాలతో, భారతదేశంలోని నీలి ఆర్థిక వ్యవస్థ దేశ ఆర్థిక వృద్ధితో కీలక సంబంధాన్ని కలిగి ఉంది. జఔ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (రాఆఉలు)కి అనుగుణంగా పర్యావరణాన్ని పరిరక్షిస్తూనే ఉపాధిని వేగవంతం చేయడం మరియు స్థూల విలువ జోడింపుని దృష్టిలో ఉంచుకుని సముద్ర వనరుల సమర్థవంతమైన మరియు స్థిరమైన వినియోగం మరియు సముద్ర సంబంధిత సామర్థ్యాలు మరియు నైపుణ్యాలను పెంచడం. భారతదేశం అధిక-వృద్ధి ఆర్థిక వ్యవస్థగా మారాలని లక్ష్యంగా పెట్టుకుంది మరియు దాని తక్షణ మరియు విస్తరించిన పొరుగు ప్రాంతంలో భౌగోళిక-వ్యూహాత్మక వాతావరణాన్ని రూపొందించడానికి దాని సామర్థ్యాలను ఏకకాలంలో పెంపొందించుకోవడం వలన, పర్యవసానంగా సముద్ర పాత్రను పోషించే దాని సామర్థ్యం కీలకమైన అంశం. సముద్ర వనరుల సంభావ్యత (జీవన మరియు నాన్-లివింగ్) అన్వేషించబడలేదు మరియు దాని సరైన సామర్థ్యానికి ఉపయోగించబడలేదు. ఈ సామర్థ్యం కేవలం బలమైన సముద్ర శక్తి యొక్క ఉత్పత్తి మాత్రమే కాదు, ఓడరేవులు, తీరప్రాంత మౌలిక సదుపాయాలు, షిప్పింగ్, ఫిషింగ్, సముద్రపు వాణిజ్యం, ఆఫ్‌షోర్ ఇంధన ఆస్తులు, పర్యాటకం, సముద్రగర్భ పైపులైన్‌లు, కమ్యూనికేషన్ కేబుల్స్, పునరుత్పాదక ఇంధనం వంటి వాటి ద్వారా స్థిరమైన పటిష్టమైన సముద్ర ఆర్థిక వ్యవస్థకు కూడా ఉపయోగపడుతుంది. సముద్రగర్భ వనరులు.

# నేషనల్ జూలాజికల్ పార్క్ 21 మార్చి, 2024న అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని జరుపుకుంటుంది




న్యూఢిల్లీ, మార్చి 22:నేషనల్ జూలాజికల్ పార్క్, న్యూఢిల్లీ (ఢిల్లీ జంతుప్రదర్శనశాల) మార్చి 21, 2024న అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని జరుపుకుంది. ఈ సంవత్సరం అంతర్జాతీయ అటవీ దినోత్సవం యొక్క థీమ్ “అటవులు మరియు ఆవిష్కరణలు: మెరుగైన ప్రపంచానికి కొత్త పరిష్కారాలు”. సందర్శకులకు మొక్కలు మరియు మన జీవితంలో వాటి ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడం ఈ ఈవెంట్ యొక్క ఉద్దేశ్యం.

నేషనల్ జూలాజికల్ పార్క్‌లోని ఎడ్యుకేషన్ సెంటర్‌లో డూడుల్ ఆర్ట్ యాక్టివిటీతో ఈవెంట్ ప్రారంభించబడింది, అక్కడ సందర్శకులు మిషన్-లైఫ్‌లో చలనచిత్రాన్ని ప్రదర్శించిన తర్వాత యాక్టివిటీలో పాల్గొనమని ప్రోత్సహించారు. సందర్శకుల కోసం ఈ కార్యకలాపాల తర్వాత ఇటీవల పునరుజ్జీవింపబడిన వాటర్ బాడీ పరిసరాల్లో ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించబడింది, ఇక్కడ నేషనల్ జూలాజికల్ పార్క్ సిబ్బంది సభ్యులు చెట్లను నాటారు.

అటవీ స్థిరమైన నిర్వహణ మరియు వాటి వనరుల వినియోగం వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి మరియు ప్రస్తుత మరియు భవిష్యత్తు తరాల శ్రేయస్సు మరియు శ్రేయస్సుకు దోహదపడటానికి కీలకం. వినూత్న పద్ధతులను ఉపయోగించడం ద్వారా ఈ విలువైన సహజ వనరులను కాపాడుకోవడం మనపై ఉంది.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్ట్రార్

మహబూబాబాద్, మార్చి 22: భూమి రిజిస్ట్రేషన్ విషయంలో సబ్ రిజిస్ట్రార్ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు ముందస్తు సమాచారంతో సాయంత్రం దాడులు నిర్వహించారు. ఒక వ్యక్తి నుంచి సబ్ రిజిస్ట్రార్ మహమ్మద్ తస్లీమా రూ. 19, 200 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# టీడీపీ నాయకుల తప్పుడు ఆరోపణలపై సీఈవోకు వైసీపీ నాయకుల ఫిర్యాదు

అమరావతి, మార్చి 22: విశాఖ పోర్టులో భారీ ఎత్తున లభ్యమైన డ్రగ్స్ వెనుకాల వైసీపీ పెద్దల హస్తం ఉందని టీడీపీ చేస్తున్న ఆరోపణలపై వైసీపీ నాయకులు శుక్రవారం ఏపీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఈవో ముఖేష్‌కు మార్‌మీనాను వైసీపీ నాయకులు పేర్నినాని , లేళ్ల అప్పిరెడ్డి, మల్లాది విష్ణు తదితరులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పేర్నినాని మీడియాతో మాట్లాడుతూ ఎలాంటి ఆదారాలు లేకుండా తప్పుడు ఆరోపణలు చేసే వారిపై ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని కోరినట్లు వెల్లడించారు. ఎన్నికల్లో వైసీపీని దెబ్బతీసేలా టీడీపీ వ్యవహరిస్తుందని మండిపడ్డారు. చంద్రబాబు, లోకేశ్‌కు విదేశాల్లో ఉన్న కొందరితో సత్సంబంధాలు ఉన్నాయని వారే అక్కడి నుంచి డ్రగ్స్ తెప్పించారని ఫిర్యాదు చేశారు.

డ్రగ్స్ స్వాధీనంపై లోతుగా విచారణ జరపాలని కోరారు. రాజకీయాల కోసం చంద్రబాబు ఎంతకైనా దిగజారిపోతాడని విమర్శించారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి చెక్కుల పంపిణీ చేసి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని ఆరోపించారు.

# సుమారు రూ.కోటి విలువైన 1.5 కిలోల కొకైన్‌ను డీఆర్ఐ స్వాధీనం

న్యూఢిల్లీ, మార్చి 22:నార్కోటిక్ డ్రగ్స్ అక్రమ రవాణాపై అణిచివేత కొనసాగిస్తూ, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (ఆఖీఎ) అధికారులు అంతర్జాతీయ సిండికేట్‌ను వెలికితీసి, ఈరోజు న్యూఢిల్లీలో సుమారు రూ. 15 కోట్ల విలువైన 1.59 కిలోల (స్థూల లిబి.) కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ంసిండికేట్ ఆఫ్రికా నుండి ఇండో-నేపాల్ సరిహద్దు ద్వారా భారతదేశంలోకి నార్కోటిక్ డ్రగ్స్ మరియు సైకోట్రోపిక్ పదార్థాల (ఔఆఖూ) అక్రమ రవాణాలో నిమగ్నమై ఉంది.

నిర్దిష్ట తెలివితేటల ఆధారంగా, 22.03.2024 ఉదయం బీహార్‌లోని రక్సౌల్ నుండి ఢిల్లీలోని ఆనంద్ విహార్ రైల్వే స్టేషన్‌లో రైలులో వచ్చిన ఒక భారతీయ జాతీయుడిని అడ్డగించగా, తెల్లటి పొడి పదార్థంతో కూడిన 92 లేత పసుపు క్యాప్సూల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఔఆఖూ ఫీల్డ్ టెస్టింగ్ కిట్ ఉపయోగించి నిర్వహించిన నమూనా పరీక్షలో కోలుకున్న పదార్థంలో కొకైన్ ఉన్నట్లు నిర్ధారించబడింది.

తదుపరి విచారణలో సరుకును న్యూఢిల్లీలోని ద్వారకలో ఉన్న వ్యక్తికి డెలివరీ చేయాల్సి ఉందని తేలింది. ఒక వేగవంతమైన తదుపరి చర్య ఫలితంగా న్యూ ఢిల్లీలోని ద్వారక వద్ద ఔఆఖూ డెలివరీ చేయడానికి స్కూటీపై వచ్చిన ఒక నైజీరియన్ జాతీయుడిని అడ్డగించారు.

తక్షణ సందర్భంలో, సిండికేట్ ట్రాలీ బ్యాగ్‌లలో దాచిపెట్టి లేదా శరీరంలోని క్యాప్సూల్స్‌ను తీసుకోవడం ద్వారా నేరుగా ఆఫ్రికన్ దేశాల నుండి నేరుగా లేదా దుబాయ్ ద్వారా ఖాట్మండు, నేపాల్‌కి విమాన మార్గం ద్వారా నిషిద్ధ వస్తువులను అక్రమంగా రవాణా చేయడానికి ఉపయోగిస్తారు. సిండికేట్ ఆ తర్వాత భారత జాతీయులను ఉపయోగించుకుంది, వీరు ముందుగా నిర్ణయించిన ప్రదేశం నుండి నిషిద్ధ వస్తువులను సేకరించేందుకు, ఖాట్మండులోని హోటళ్లతో సహా, ఇండో-నేపాల్ సరిహద్దులో అక్రమంగా రవాణా చేయడానికి న్యూఢిల్లీ నుండి ఖాట్మండుకు వెళ్లారు. క్యారియర్ అప్పుడు సరుకును రోడ్డు లేదా రైలు ద్వారా న్యూఢిల్లీకి తీసుకువెళుతుంది.

1.59 కిలోల (గ్రాస్ డబ్ల్యూటీ) బరువున్న 92 క్యాప్సూల్స్‌లో దాచి ఉంచిన కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు, దీని విలువ సుమారు రూ. 15 కోట్లు, నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డిపిఎస్) చట్టంలోని నిబంధనల ప్రకారం క్యారియర్ మరియు గ్రహీత ఇద్దరినీ అరెస్టు చేశారు.

# రైతులకు ఎకరాకు రూ.15వేల నష్టపరిహారం- మైనంపల్లి రోహిత్

మెదక్, మార్చి 22: ఇటీవల మెదక్ నియోజకవర్గంలోని నిజాంపేట మండల పరిధిలోని పలు గ్రామాల్లో భారీ గాలులతో వడగండ్ల వాన కురిసిన విషయం విధితమే? ఈ విషయమై మెదక్ నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ మెదక్ నియోజక వర్గంలోని నిజాంపేట మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ముఖ్యంగా వరి పంటతో పాటు మొక్కజొన్న పంట పూర్తి స్థాయిలో దెబ్బతిన్న విషయాన్ని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళారు.

తక్షణమే జిల్లా కలెక్టర్ తో పాటు వ్యవసాయ శాఖ అధికారులతో చర్చించి పంట నష్టపోయిన వివరాలను సేకరించాలని సూచించారు. ఇదిలా ఉండగా హైదరాబాద్ లోని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావ్ తో మెదక్ నియోజక వర్గంపై సమీక్ష నిర్వహించారు.

# పుదుచ్చేరిలో జరిగిన కెవికె గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్ కర్టెన్ రైజర్

న్యూఢిల్లీ, మార్చి 22:ICAR-కృషి విజ్ఞాన కేంద్రాలు 2024లో తమ గోల్డెన్ జూబ్లీ సంవత్సరాన్ని జరుపుకుంటున్నాయి. ఈరోజు పుదుచ్చేరిలో స్వర్ణోత్సవ వేడుకల కర్టెన్ రైజర్ జరిగింది. 1వ ఐఎఐని ఎఅంఖీ 21 మార్చి 1974న పుదుచ్చేరిలో స్థాపించింది.

సెక్రటరీ (DARE) మరియు డైరెక్టర్ జనరల్ (ICAR డాక్టర్ హిమాన్షు పాఠక్ తన వీడియో ప్రసంగంలో ఐఎఐల ద్వారా సాంకేతిక పరిజ్ఞానాల బదిలీ దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి ఉ ఉద్యానవన ఉత్పత్తిని పెంచడంలో సహాయపడిందని పేర్కొన్నారు. సాంకేతికత బదిలీ, సామర్థ్యాల పెంపుదల, మార్కెట్ సమాచారం, అట్టడుగు స్థాయి రైతులకు నైపుణ్యాభివృద్ధికి కేవీకేలు సమగ్ర కేంద్రంగా పనిచేయాలని ఆయన అన్నారు. ముఖ్య అతిథి, పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డాక్టర్ శరత్ చౌహాన్ గత కొన్ని సంవత్సరాలలో గణనీయమైన విజయాలు సాధించినందుకు వ్యవసాయ నిర్వాహకులు, శాస్త్రవేత్తలు మరియు రైతు సంఘాన్ని అభినందించారు. వరి, గోధుమలు, పంచదార మరియు మిల్లెట్ వంటి ప్రధాన పంటలకు అత్యధిక ఎగుమతులు జరిగినట్లు ఆయన హైలైట్ చేశారు.

డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (వ్యవసాయ విస్తరణ) ఎఅంఖీ, డాక్టర్ ఉదమ్ సింగ్ గౌతమ్, శిక్షణ మరియు నైపుణ్యాభివృద్ధి సహాయంతో రైతులు విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా మారడానికి ఐఎఐల కృషిని నొక్కి చెప్పారు. ఐఎఐ కేవలం శిక్షణా సంస్థ నుండి ఏక విండో వ్యవసాయ నాలెడ్జ్ మరియు కెపాసిటీ డెవలప్‌మెంట్ సెంటర్‌గా మార్చబడిందని ఆయన పేర్కొన్నారు. రైతులకు నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, విత్తనాలు మరియు మొక్కలు నాటే సామగ్రిని సమకూర్చాలని డిడిజి కెవికెలను కోరారువైస్ ఛాన్సలర్, రాణి లక్ష్మీభాయ్ సెంట్రల్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ, ఝాన్సీ, డాక్టర్ ఎ.కె. రైతులకు సాంకేతిక మద్దతును అమలు చేయడం మరియు బదిలీ చేయడం కోసం ఐఎఐల నెట్‌వర్కింగ్ యొక్క ప్రాముఖ్యతను సింగ్ నొక్కిచెప్పారు. స్టార్టప్‌ల ద్వారా జిల్లా స్థాయిలో అగ్రి-బిజినెస్‌ను ప్రోత్సహించాలని, అట్టడుగు స్థాయిలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ చేయాలని కెవికెలను ఆయన కోరారు. డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (హార్టికల్చర్), ఐసిఎఆర్, డా. ఎస్.కె. మొత్తం వ్యవసాయ రంగంలో కేవీకేల కాన్సెప్ట్ ప్రత్యేకమైనదని సింగ్ అన్నారు. రైతులు అధిక లాభాలు పొంది అగ్రిప్రెన్యూర్‌లుగా మారాలని ఆయన ఉద్ఘాటించారు. సెక్రటరీ, (వ్యవసాయం), పుదుచ్చేరి ప్రభుత్వ, శ్రీ ఎ. నెదుంచెజియన్ మాట్లాడుతూ, భారత ప్రభుత్వం ప్రజల ప్రయోజనాల కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని మరియు రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి ప్రగతిశీల చర్యలు తీసుకోవడానికి ఐఎఐలను నొక్కి చెబుతుంది.

# నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, మార్చి 22:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని బద్ది పోచమ్మ విధి ముదిరాజ్ సంఘ సభ్యులు శుక్రవారం చెక్కంల్లి రోడ్డులో గల పెద్దమ్మతల్లిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దర్శిం చుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా దేవాలయం ఆవరణలో ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ముదిరాజ్ సంఘ సభ్యులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సందర్భంగా అందుకు సహకరించిన ప్రభుత్వ విప్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ విప్ మాట్లాడుతూ తనను ఆహ్వానించి, ఆత్మీయంగా సన్మానం చేసిన బద్ది పోచమ్మ వీధి ముదిరాజ్ సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. నా గెలుపులో భాగస్వామ్యం అయినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వం ముదిరాజులకు చేసింది ఏమీ లేదన్నారు. మొన్నటి ఎన్నికల్లో ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత ముదిరాజులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారని అన్నారు. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం వల్ల పేద ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే ఒక చారిత్రాత్మక నిర్ణయంగా కులగణన చేపట్టడంతో పాటు 16 కులాల కార్పొరేషన్ ఏర్పాటు చేయడం కేవలం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి దక్కిందన్నారు. పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, కాంగ్రెస్ నాయకులు కూరగాయల కొమురయ్య, పుల్కం రాజు, చిలక రమేష్, అన్నారం శ్రీనివాస్, శ్రీశైలం, ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జెమిని టీవి లో మార్చ్ 25 నుండి "సివంగి".. సరికొత్త సీరియల్ ప్రసారం




హైదరాబాద్ మార్చ్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూ స్)తెలుగు ప్రేక్షకుల వినోదానికి కేరాఫ్ అడ్రస్ గా నిలిచిన జెమిని టివి . ఎన్నో కార్యక్రమాలను , మరిన్నో సీరియల్స్ ను మనకు అందించి ముందుకు వెళుతుంది. తాజాగా ఇప్పుడు మనకు "సివంగి".. అనే సరికొత్త సీరియ హిల్ ను మార్చ్ 25 నుండి ప్రసారం చేయబోతోంది. ఒక పల్లెటూరిలో పేద కుటుంబంలో పుట్టి, ఊరిలోని ఆడవాళ్ళ డ్రెస్సులు కుడుతూ అమ్మానాన్నలకు ఆర్థికంగా సహాయపడుతూ , స్నేహితులతో సరదాగా జీవితాన్ని గడిపే అమ్మాయి ఆనంది. వూళ్ళో ఎవరికీ ఏ కష్టం వచ్చినా, సొంత మనిషిలా వెళ్లి సహాయపడుతుంది . అక్క పెళ్ళిలో ఏర్పడిన అనుకోని పరిస్థితుల వల్ల ఒక కొడుకులా ఇంటి బాధ్యతలు భుజాన వేసుకొని , అవి నెరవేర్చడానికి సిటీకి ప్రయాణమవుతుంది. సిటీకి వెళ్లిన ఆనంది ఎదుర్కొన్న సంఘటనలు ఏంటి ?. తన అక్క పెళ్లి చేయగలిగిందా ?. తిరిగి తన వూరు వెళ్లగలిగిందా ? జెమిని టివిలో.. సివంగి. ఈనెల 25న ప్రారంభం – సాయంత్రం 7.30 గంటలకు. వీక్షించవచ్చు ఈ "సివంగి ". సీరియల్ ప్రేక్షకుల ఆధారాభిమానాలను పొందడంలో ఎలాంటి సందేహం లేదని జెమినీ టీవీ యాజమాన్యం ఆశాభావం వ్యక్తం చేసారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో విద్యార్థులకు అత్యుత్తమ ర్యాంకులు



కరీంనగర్, మార్చి 22: (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ పట్టణంలోని స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్లో విద్యార్థులు జాతీయ జాతీయ స్థాయి మ్యాథ్స్, సైన్స్ ఒలంపియాడ్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన అభినందన సభకు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణిత శాస్త్రంలో అనేక విషయాలు ఉన్నాయని, ఆ విషయాల ద్వారా గణిత శాస్త్రాన్ని సులభంగా నేర్చుగోగల్గుతున్నారని అభిప్రాయం డుతూ ప్రతి ఒక్కరు వారు తెలుపబడిన నిబంధనలను పాటించి గణిత శాస్త్రంలో ముందంజలో ఉండాలని చెప్పారు. విద్యార్థులకు వివిధ దశల్లో ప్రోత్సహం అందిస్తూ ముందంజలో నిలుపుతున్నామని తెలుపుతూ విద్యార్థులందరూ క్రమం తప్పకుండా వివిధ విషయాలలో పట్టు సాధించి వారికి ప్రత్యేక పరీక్షను నిర్వహించి, అర్హత సాధించిన వారిని వివిధ పోటీపరీక్షలకు ఎంపిక చేస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలో ప్రముఖ పోటి పరీక్షల సంస్థ అయిన ఒఎంఎన్ అకాడమి వారు నిర్వహించినటువంటి జాతీయ స్థాయి మ్యాథ్స్ ఓలంపియాడ్ లో పాఠశాలకు చెందిన పి. మయాంక్ రెడ్డి. ఎ. విహాన్ కృష్ణ. 3వ తరగతి, రహమాన్, ఆరాధ్య, క్రిషిక్ ప్రిన్స్, 4 వతరగతి, తదితర విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించడమే కాకుండా బహుమతులను గెల్చుకున్నారని తెలిపారు. విజేతలందరికి పుష్పగుచ్ఛాలను అందచేసి, భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రిన్సిపాల్, నిర్వహణ బృందం పాల్గొన్నారు.

# ఐడీఏ బొల్లారంలో 90 కిలోల డ్రగ్స్ పట్టివేత..



హైదరాబాద్, మార్చి 22:హైదరాబాద్‌లో మరోసారి భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. ఇంటర్‌పోల్ సమాచారం మేరకు డ్రగ్ కంట్రోల్ అధికారులు నగర శివార్లలోని ఐడీఏ బొల్లారంలో ఉన్న పీఎస్ఎన్ మెడికేర్ కంపెనీలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 90 కిలోల మెపిడ్రిన్‌ను సీజ్ చేశారు. దీనివిలువ దాదాపు రూ.9 కోట్ల వరకు ఉంటుందని చెప్పారు.బొల్లారం పరిధిలో గత పదేండ్లుగా డ్రగ్స్ దందా చేస్తున్న కస్తూరి రెడ్డి.. సిగరెట్ ప్యాకెట్ల మాటున విదేశాలకు డ్రగ్స్ తరలిస్తున్నట్లు గుర్తించారు. హైదరాబాద్‌లోనూ డ్రగ్స్ సరఫరా చేసినట్లు అనుమానిస్తున్నారు. ఈమేరకు కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


# సమాజాన్ని మేల్కొపేదే అసలైన కవిత్వం




అమరావతి, మార్చి 22:సమాజాన్ని మేల్కోపేదే అసలైన కవిత్వమని ప్రముఖ కవి, పాలమూరు సాహితి అధ్యక్షులు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ అన్నారు. మార్చి 22 న మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఒకరోజు రాష్ట్రస్థాయి కార్యశాల కార్యక్రమానికి ఆయన ముఖ్యవక్తగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో పద్యం నుంచి వచన కవిత్వం దాకా అనేక కవితాప్రక్రియలు పురుడు పోసుకున్నాయన్నారు. మహాకవి శ్రీ శ్రీ తెలుగు సాహిత్యంలో మహాప్రస్థానం కవితాసంపుటితో బలమైన ముద్ర వేసారన్నారు. గురజాడ, కాళోజీ, గుర్రం జాషువా, దాశరథి, సినారె వంటి లబ్ధప్రతిష్టమైన కవులు తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారన్నారు. కవితారచనలో వస్తువు, భాష, శైలి, అభివ్యక్తి ప్రధానమన్నారు. సమకాలీన వస్తువులను తీసుకుని కవితలను అల్లాలన్నారు. కార్యశాల కన్వీనర్ విరలాపురం పుష్పలత మాట్లాడుతూ కవిత్వంలో భాషతో పాటు నిర్మాణశైలి ముఖ్యమన్నారు. తెలుగు సాహిత్యంలో ఉపమాలంకారాలతో కవిత్వం రాస్తేనే రాణిస్తుందన్నారు. వస్తువు ఏదైనా కవిత్వం చేయడంలో కవి ప్రతిభ కనిపించాలన్నారు.

సభాధ్యక్షులు కెప్టెన్ డాక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ తెలుగు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యశాలలో కనీసం వెయ్యిమంది కవయిత్రులు తయారుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అమీనా, అకాడమిక్ కో ఆర్డినేటర్ లావణ్య, తెలుగు శాఖ అధ్యాపకులు లక్ష్మీనరసింహారావు, సునిత, హేమలత, బోల యాదయ్య, పొన్నగంటి ప్రభాకర్, వంగా వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# బజాజ్ నుంచి సీఎన్జీ బైక్.. జూన్ లో ఆవిష్కరణ



న్యూఢిల్లీ, మార్చి 22:దేశంలో పేరొందిన ఆటోమొబైల్ సంస్థ బజాజ్ ఆటో క్లీన్ ఫ్యుయల్ సీఎన్జీ మోటార్ సైకిల్ డెవలప్‌చేస్తున్నది. జూన్‌లో సీఎన్జీ బజాజ్ ఆటో మోటార్ సైకిల్‌ను మార్కెట్లో ఆవిష్కరిస్తామని బజాజ్ ఆటో మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ బజాజ్ శుక్రవారం తెలిపారు. పర్యావరణ పరిరక్షణతోపాటు ఇంధన పొదుపు పాటించే కస్టమర్లను లక్ష్యంగా చేసుకుని డిఫరెంట్ బ్రాండ్ కింద సీఎన్జీ బైక్ ఆవిష్కరిస్తామని చెప్పారు. కస్టమర్ల సౌకర్యార్థం సీఎన్జీ మోటారు బైక్‌లో పెట్రోల్, సీఎన్జీ ఫ్యుయల్ ఆప్షన్ల కోసం విడిగా ప్రత్యేక ఫ్యుయల్ ట్యాంక్ ?ర్పాటు చేస్తారు. తత్ఫలితంగా పెట్రోల్ మోటారు బైక్‌లతో పోలిస్తే 'బజాజ్ సీఎన్జీ బైక్' ధర ఎక్కువగా ఉంటుందని రాజీవ్ బజాజ్ చెప్పారు.

20 ఏండ్ల క్రితం మార్కెట్లో విడుదల చేసిన పల్సర్ మోడల్ మోటారు సైకిళ్లకు కస్టమర్ల నుంచి అద్భుతమైన స్పందన, ఆదరణ లభించిందని రాజీవ్ బజాజ్ తెలిపారు. త్వరలో బజాజ్ పల్సర్ విక్రయాలు 20 లక్షల యూనిట్లకు చేరతాయని చెప్పారు. పల్సర్ బజాజ్ మోటారు సైకిలు మాదిరిగానే బజాజ్ సీఎన్జీ బైక్‌ను కూడా కస్టమర్లు ఆదరిస్తారని భావిస్తున్నట్లు చెప్పారు.

# తెలంగాణలో కట్టిన ఈ నిర్మాణం చూస్తే మీ హృదయం గర్వంతో ఉప్పొంగుతుంది. దాని వెనక కథ కేవలం హిస్టరీ టీవీ 18 లో




హైదరాబాద్, మార్చి 22: శౌర్యం మరియు త్యాగానికి నివాళిగా, ప్రపంచంలోనే అతిపెద్ద అతుకులు లేని ఉక్కు నిర్మాణం అయిన తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపాన్ని హైదరాబాద్ ఆవిష్కరించింది. మట్టి దీపం ఆకారంలో ఉండే ఈ నిర్మాణ అద్భుతం 2,88,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో అమరుల జ్ఞాపకంగా, వారికి నివాళిగా నిలుస్తుంది . వినూత్న డిజైన్, నిర్మాణ సాంకేతికతలకు నిదర్శనం అయిన ఈ మార్గదర్శక నిర్మాణం గురించి సోమవారం, మార్చి 25న రాత్రి 8 గంటలకు కేవలం హిస్టరీ టీవీ 1 8 లో మాత్రమే ప్రసారం కానున్న 'హాఓఉ ! యే మేరా ఇండియా' ఏడవ ఎపిసోడ్‌లో తెలుసుకోండి. ఒక కొత్త ఒరవడిని సృష్టిస్తూ తన పదో సీజన్ కి చేరుకున్న ఈ ఫ్యాక్చువల్ ఎంటర్ టైన్మెంట్ షో ప్రతి సోమవారం రాత్రి 8 గంటలకు ప్రసారమవుతుంది. తమ అసమానమైన ప్రతిభతో, వింత వింత అభిరుచులతో, సమాజాన్ని ప్రభావితం చేస్తూ, సాంకేతిక అద్భుతాలను సృష్టిస్తున్న అబ్బురపరిచే, ఆహా అనిపించే వ్యక్తుల కథలను వీక్షకులకు అందిస్తూ తన వాగ్దానాన్ని నిలబెట్టు కుంటోంది. 4,500 ప్రీమియం 316ఒ గ్రేడెడ్ స్టీల్ షీట్‌లతో నిర్మించబడిన ఈ స్మారక స్థూపం కేవలం ఒక ఇంజినీరింగ్ ఘనత మాత్రమే కాదు. తెలంగాణ అమరవీరులు తమ నేల కోసం చూపిన ధైర్యసాహసాలు అందించే శాశ్వత కాంతికి చిహ్నం. శిల్పి రమణా రెడ్డి రూపొందించిన ఈ స్మారక స్థూపం, దీని నిర్మాణంలో వినియోగించిన మెటీరియల్ లానే శాశ్వతంగా నిలిచిపోతుంది. తమ రాష్ట్ర హీరోలను స్మరించుకోవడంలో ఆ రాష్ట్రం ప్రదర్శించిన అంకితభావాన్ని ప్రతిబింబిస్తుంది. తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపం ఈ సోమవారం రాత్రి 8 గంటలకు 'హాఓఉ! యే మేరా ఇండియా'!లో. హైదరాబాద్ నగరంలో నిర్మించిన ఈ ఇంజినీరింగ్ అద్భుతాన్ని చూసి గర్వపడండి. ఇదే కాదు, ప్రపంచ రికార్డు బద్దలు కొట్టేందుకు కనీవినీ ఎరగని ఎత్తులను అధిరోహించిన ముంబయికి చెందిన గోవిందా కథతో పాటు, ఇలా దేశవ్యాపితంగా ప్రేరణ పంచే మరెందరో వ్యక్తుల కథలను తెలుసుకోండి!'హాఓఉ! యే మేరా ఇండియా' ప్రతీ సోమవారం రాత్రి 8 గంటలకు. కేవలం హిస్టరీ టీవీ 18 లో!

# ఆర్థిక వ్యవస్థలో హైడ్రోజన్ మరియు ఇంధన కణాల కోసం అంతర్జాతీయ భాగస్వామ్యం యొక్క 41వ స్టీరింగ్ కమిటీ సమావేశం

న్యూఢిల్లీ, మార్చి 22:మార్చి 18 – 22, 2024 మధ్య న్యూ ఢిల్లీలో భారతదేశం నిర్వహిస్తున్న హైడ్రోజన్ మరియు ఇంధన కణాల అంతర్జాతీయ భాగస్వామ్యం (ఎఖఊఇ) యొక్క 41వ స్టీరింగ్ కమిటీ సమావేశం యొక్క నాల్గవ రోజు, వాటాదారుల సంప్రదింపుల దినోత్సవంగా నిర్వహించబడింది, స్టీరింగ్ కమిటీ మీటింగ్ యొక్క ఇండస్ట్రీ ఔట్రీచ్ ప్రోగ్రామ్‌లో భాగంగా. మార్చి 21, 2024న న్యూ ఢిల్లీలోని సుష్మా స్వరాజ్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమం క్లీన్ అండ్ గ్రీన్ హైడ్రోజన్ టెక్నాలజీల అభివృద్ధికి కీలకమైన వాటాదారుల మధ్య సహకారం మరియు సంభాషణలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది.

గ్రీన్ హైడ్రోజన్ ఆర్థిక వ్యవస్థను డీకార్బనైజ్ చేయడంలో మరియు వాతావరణ మార్పులను పరిష్కరించడంలో సహాయపడుతుంది" కొత్త ఒ పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ సుదీప్ జైన్ వాతావరణ మార్పుల యొక్క ప్రతికూల ప్రభావాలను ఎత్తి చూపారు మరియు సవాలును పరిష్కరించడానికి తక్షణ చర్యల అవసరాన్ని హైలైట్ చేశారు. గ్రీన్ హైడ్రోజన్ అప్లికేషన్‌తో సహా ఆర్థిక వ్యవస్థను డీకార్బనైజేషన్ చేయడం ఈ సవాళ్లను అధిగమించడంలో సహాయపడుతుందని ఆయన పేర్కొన్నారు.

"భారతదేశం జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ లక్ష్యాలను సాధిస్తే, అది ప్రపంచ హైడ్రోజన్ అభివృద్ధిలో దేశాన్ని ముందంజలో ఉంచుతుంది"

వైస్ చైర్, IPHE డాక్టర్ నోయ్ వాన్ హల్స్ట్ గ్రీన్ హైడ్రోజన్‌ను ప్రోత్సహించడంలో భారతదేశం చేస్తున్న ప్రయత్నాలను ప్రశంసించారు మరియు IPHE లో పాల్గొనే దేశాలు భారతదేశ జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్, దాని ప్రతిష్టాత్మక లక్ష్యాలు మరియు అమలు చేస్తున్న విధానాలు మరియు నియంత్రణ ఫ్రేమ్‌వర్క్‌ను చూసి ముగ్ధులయ్యాయని పేర్కొన్నారు. దీన్ని సాధించు. ఈ లక్ష్యాలను భారత్ సాధిస్తే ప్రపంచ హైడ్రోజన్ అభివృద్ధిలో దేశాన్ని అగ్రగామిగా నిలబెడతామన్నారు. స్టీరింగ్ కమిటీ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించడంతోపాటు ఆతిథ్యమిచ్చినందుకు తన భారతీయ ప్రతినిధికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

"గ్రీన్ హైడ్రోజన్ స్వీకరణను సులభతరం చేయడంలో WTO మరియు WTO సహాయక పాత్ర పోషించాలి"

గ్రీన్ హైడ్రోజన్‌పై CII టాస్క్‌ఫోర్స్ చైర్‌పర్సన్ మరియు అవాడ గ్రూప్ చైర్‌పర్సన్ శ్రీ వినీత్ మిట్టల్ హైడ్రోజన్ ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడంలో IPHE పాత్రను ప్రశంసించారు.

ఆహ్వానం

కవిసంధ్య

కవిసంధ్య సాహితీ సాంస్కృతిక సంస్థ యానాం.
భాషా సాంస్కృతిక శాఖ - హైదరాబాద్ సంయుక్త నిర్వహణలో...
ప్రపంచ కవితా దినోత్సవం - 2024

కవిసంధ్య, డా॥ భట్టిప్రోలు దుర్గాలక్ష్మీ ప్రసన్న
**కవితల పోటీ బహుమతుల ప్రదానం**

**కవిత్వంపై ప్రసంగం**

**కవిసంధ్య పత్రిక, కవిత్వ గ్రంథావిష్కరణలు**

**కవిసమ్మేళనం**

24 మార్చి, 2023, ఆదివారం, సా॥ 5:30 గం॥లకు
నంబూరి పరిపూర్ణ వేదిక
కాన్ఫరెన్స్ హాలు,
రవీంద్రభారతి, హైదరాబాద్.

దాట్ల దేవదానం రాజు, కన్వీనర్, కవితల పోటీ
శిఖామణి, అధ్యక్షులు, కవి సంధ్య

ముఖ్యఅతిథి : శ్రీ **కె.శివారెడ్డి**, సరస్వతీ సమ్మాన్ అవార్డుగ్రహీత
సభాధ్యక్షులు : కళారత్న **డా॥శిఖామణి**, కవిసంధ్య సంపాదకులు
గౌరవ అతిథి : శ్రీ **వాడ్రేవు చినవీరభద్రుడు**, ప్రముఖ కవి, విమర్శకుడు
విశ్రాంత ఐ.ఏ.ఎస్ అధికారి
సభా ప్రారంభకులు : **డా. మామిడి హరికృష్ణ**,
డైరెక్టర్, భాషా సాంస్కృతిక శాఖ
ప్రత్యేక ప్రసంగం : శ్రీ **కొప్పర్తి వెంకట రమణ మూర్తి**
అంశం : కవిత్వం - పారదర్శకత
కవితల పోటీ నివేదిక : కళైమామణి **దాట్ల దేవదానంరాజు**
ప్రా.శ్రీ.తెలుగు విశ్వవిద్యాలయ కీర్తిపురస్కార గ్రహీత
న్యాయ నిర్ణేత స్పందన :
శ్రీ **యార్లగడ్డ రాఘవేంద్రరావు**, ప్రముఖ కవి, పాత్రికేయులు
కవిసంధ్య 47 ఆవిష్కర్త : శ్రీమతి **శీలాసుభద్రాదేవి**, ప్రముఖ కవి, రచయిత్రి
ఆత్మీయ అతిధులు :
శ్రీ **సుధామ**, ప్రముఖ కవి, విమర్శకులు
శ్రీ **డానియేల్ నెజర్స్**
ప్రముఖ ఫ్రెంచి భాషా పరిశోధకులు, అనువాదకులు
శ్రీ **బి.ఎస్.ఆర్.ఆంజనేయశర్మ** (బహుమతుల ప్రదాత)
శ్రీ **మధునాపంతుల సత్యనారాయణ మూర్తి**,
ఆంధ్రీ కుటీరం, పల్లిపాలెం.

**కవిసమ్మేళనం..**
నిర్వహణ : శ్రీ **సి.ఎస్.రాంబాబు**, ప్రముఖ కవి, రేడియో ప్రయోక్త
స్వాగతం: శ్రీ **చల్లా రామఫణి**, ప్రముఖ కవి

**గ్రంథావిష్కరణలు :**

**అవధానుల మణిబాబు**
నింగికి దూరంగా నేలకు దగ్గరగా
ఆవిష్కర్త : శ్రీ **కొప్పర్తి**
---
**పొత్తూరి సీతారామరాజు**,
ఖాళీ సీసాలో మనిషి
ఆవిష్కర్త : శ్రీ **యార్లగడ్డ రాఘవేంద్రరావు**

**శ్రీనివాస్ వాసుదేవ్ :**
జాతర
ఆవిష్కర్త : శ్రీ **కె.శివారెడ్డి**

**నక్బ**
**గాజా సంఘీభావ కవిత్వం**
సంకలన కర్త : శ్రీ **నేలపూరి రత్నాజీ**
ఆవిష్కర్త : డా॥ **మామిడి హరికృష్ణ**

కవిసంధ్య, డా॥ భట్టిప్రోలు దుర్గా లక్ష్మీ ప్రసన్న
స్మారక వచన కవితల పోటీ బహుమతి గ్రహీతలు - 2024

ప్రథమ బహుమతి : రూ. 3000/-
యుద్ధలిపి - **ఆవాల శారద,** విజయవాడ,
ద్వితీయ బహుమతి : రూ. 2000/-
ఒంటరిరేవు - **చొక్కర తాతారావు**, విశాఖపట్నం,
తృతీయ బహుమతి : రూ.1000/-
దుఃఖ పాలం - **నేలపూరి రత్నాజీ**, చాగల్లు,
కన్సోలేషన్ బహుమతులు: ఒక్కొక్కటి రూ. 500/-

1. ఫొటో - దేశరాజు,హైదరాబాద్,
2. యుద్ధము- నేల, కుందుర్తి కవిత, సింగపూర్
3. ఇనప్పెట్టె - రాజేశ్వరరావు లేదాళ్ల, లక్సెట్టి పేట,
4. కాటికాపరి - లోగిశ లక్ష్మీనాయుడు, సింహాచలం,
5. చెమట పటిమ - కె. దాసుబాబు, శ్రీ కాకుళం,
6. ఋతు నిష్క్రమణ - దాసరి మోహన్, హైదరాబాద్,
7. కొన్ని కన్నీళ్లు మిగిలే వున్నాయి - పొత్తూరి సీతారామరాజు, కాకినాడ,

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com